తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఆదివారం
17 మే, 2026



# జీవితాన్ని వెలిగించే మహా 'ప్రాణ' దానం

# నితిన్ కొత్త సినిమా

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై హీరో నితిన్ కొత్త చిత్రం రూపొందనుంది. హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్‌ను వైభవంగా మొదలుపెట్టారు.

ఈ సినిమాతో సోము నర్రి అనే కొత్త దర్శకుడు టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో నితిన్ సరసన 'అశోకవనంలో అర్జున కళ్యాణం' ఫేమ్ రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది.



శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి సంగీతం అందించనున్నారు.

ప్రారంభోత్సవం జరుపుకున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ నెల రెండో వారం నుంచి మొదలుపెట్టాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

వరుస విజయాలతో జోరుమీదున్న సితార సంస్థ, ఈ సినిమాతో నితిన్‌కు ఒక మంచి కమర్షియల్ హిట్ అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. త్వరలోనే సినిమా టైటిల్, ఇతర నటీనటుల పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

తారాతీరం

# 'ఎన్‌బికె111'లో నర్గీస్ ఫక్రీ

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రాబోతున్న NBK111 సినిమా గురించి వస్తున్న తాజా సమాచారం నందమూరి అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఈ చిత్రంలో బాలయ్యతో బాలీవుడ్ బ్యూటీ నర్గీస్ ఫక్రీ జత కట్టనున్నట్లు సమాచారం.



మరోవైపు, 'వీరసింహారెడ్డి' వంటి మాస్ హిట్టు తర్వాత బాలయ్య, గోపీచంద్ వీరిద్దరూ కలుస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. గతంలో గోపీచంద్ మలినేని సినిమాల్లోని ఐటెం సాంగ్స్ ఎంత పెద్ద హిట్ అయ్యాయో మనకు తెలిసిందే. ఈసారి ఆ జోరును మరింత పెంచేందుకు బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. 'రాక్ స్టార్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నర్గీస్, బాలయ్య ఎనర్జీకి తోడైతే స్క్రీన్‌పై గ్లామర్ అండ్ మాస్ విజువల్స్ అదిరిపోతాయని అభిమానులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఒక స్టూడియోలో పాట కోసం చిత్ర బృందం ఒక భారీ సెట్‌ను నిర్మించినట్లు తెలుస్తోంది. గోపీచంద్ మలినేని కూడా బాలయ్యను పక్కా మాస్ యాక్షన్ అవతారంలో చూపించబోతున్నట్లు టాక్.

ఆదివారం వార్త

17 మే, 2026

## మంచి ముత్యాలు

– ఉల్లాసవంతుడైన మిత్రుడు ఎల్లెడలా ప్రకాశాన్ని వెదజల్లే సూర్యుని వంటివాడు. – సర్ జాన్ లుబ్బక్

– రచయితకు కన్నీళ్లు లేకపోతే పాఠకుడికి కన్నీళ్లు రావు.

## కదంబం

'సంఘీ'భావం....5
కలవరపెడుతున్న ఎల్‌నినో

కవర్ స్టోరీ..6
జీవితాన్ని వెలిగించే
మహా 'ప్రాణ' దానం

ఈ వారం కవిత్వం.. 11
అప్పుడప్పుడు..

భక్తవత్సలుని మరో వాసం..18

కథ..20
మూడో కోణం

ఇంకా...
మొగ్గ
పుస్తక సమీక్ష
వాస్తు
వారఫలం
వగైరా.. వగైరా..

# సమాచారం

## చెట్ల నుండి విద్యుత్తు

వింతగా విన్నాయే ఈ చెట్లు..! ఒకసారి చూస్తే బాగుంటుంది కదా! అనుకుని తీరా దగ్గరికి వెళ్లి చూస్తే మనం అనుకున్నది ఒకటి అయినది ఒకటి అన్నట్లుంటుంది జర్మనీలోని కొన్ని చెట్లను చూస్తే.

ఇంతకు అసలు సంగతి ఏమిటంటే దూరంగా నుంచి చూడగానే ఆ చెట్ల మీద వివిధ రంగుల పక్షులు వాలి వున్నట్లు కనిపిస్తాయి. దగ్గరికి వెళ్లి చూస్తే అవి పక్షులు కాదు.. కరెంటును తయారు చేసే చెట్లు అని అర్థమవుతుంది. సాధారణంగా చల్లదనం కోసం, గాలికోసం చెట్లు నాటుతుంటాం కదా! అయితే జర్మనీలో విండ్ ట్రీస్/కరెంటు చెట్లు నాటుతున్నారు. వీటిని న్యూవిండ్ ఫ్రెంచ్ కంపెనీ తయారు చేసింది. ఈ చెట్ల కాండం స్టీల్‌తో, ఆకులని ప్రత్యేకమైన సోలార్ ప్యానెల్స్‌తో తయారు చేసారు. చిన్నగా గాలి వీచినప్పుడు ఈ ఆకులు చక్కగా తిరుగుతాయి. పవనశక్తినీ, సౌరశక్తినీ ఉపయోగించుకుని విద్యుత్తును తయారు చేస్తున్న ఈ చెట్లు ఈ–స్టేషన్లుగా మారి గృహావసరాలకు అవసరమైన కరెంటును అందిస్తున్నాయి. బ్రిటన్, జర్మనీ, స్విట్జర్లాండ్ మొదలైన దేశాల్లో ఈ విండ్ ట్రీస్‌ను ఉపయోగిస్తున్నారు. గృహావసరాలకు ఉపయోగించే విద్యుత్తులో సుమారు ఇరవై శాతం ఈ చెట్ల నుండి లభిస్తున్నట్లు సమాచారం.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




## వ్యత్యాసం

టీచర్: ఒరేయ్ శ్రీనూ, సీనియర్ అంటే ఎవరు? జూనియర్ అంటే ఎవరు? వీళ్లిద్దరి మధ్య వ్యత్యాసం



ఏమిటి?

శ్రీను: 'సీ'కి అంటే సముద్రానికి దగ్గరగా ఉండేవాడు సీనియర్; 'జూ'కి అంటే జంతుప్రదర్శనశాలకి దగ్గరగా ఉండేవాడు జూనియర్ టీచర్.

టీచర్: ఆ ..... !

– మా. శ్రీ. రాజు, పాల్వంచ

## మనకు పోటీ..

శిష్యుడు: మనుషులు కుటుంబం, వివాహం అంటూ ఎందుకు అంత ఆరాటపడుతూ ఉంటారు గురూజీ?

గురువు: వాళ్ళు అలా ఉండడమే సరైనది. లేకపోతే వాళ్ళు కూడా మనలాగా మారుతారు.. అప్పుడు మన మధ్య పోటీ ఎదురవుతుంది..

## మరిచిపోయాం!

పోలీస్: సాధారణంగా దొంగలు ముఖానికి మాస్క్ పెట్టుకుని దొంగతనాలు చేస్తారు కదా! మీరు మాస్క్ లేకుండా దుకాణంలో దొంగతనం ఎలా చేసారు?



దొంగలు: దొంగతనం అయ్యాక వెళ్ళేముందు సీసీ టీవీ హార్డ్ డిస్క్ కూడా తీసుకెళ్దాం అనుకున్నాం.. కానీ పోలీస్ సైరన్ వినపడి ఆ విషయం మర్చిపోయి పారిపోయాం.

–ఎస్.కె.యాకూబ్ పాషా, ఖమ్మం

## రోజూ తాగండి..

"ఏమండీ! రేపటి నుండి మీరూ రోజూ క్రమం తప్పకుండా తాగి రండి" అంది భర్తతో, భార్య.

"ఎందుకని?" అడిగాడు ఆశ్చర్యంగా.

"మీరు తాగి వస్తే ఇంటి పనంతా శుభ్రంగా చేస్తున్నారు. నిన్న రాత్రి పాత్రలన్నీ నీట్‌గా కడిగిపెట్టారు."

## అదే క్లాస్...

"చింటూ, నీ రిజల్ట్ ఏమైంది?" అడిగింది, తల్లి రెండో తరగతి పరీక్షలు రాసిన కొడుకుని.

"ఇంకో సంవత్సరం ఇదే క్లాస్‌లో చదవాల్సి ఉంటుందన్నాడు టీచర్" చెప్పాడు తల్లితో.

"వెరీ గుడ్. ఇంకో రెండు మూడు సంవత్సరాలు అదే క్లాసులో వున్నా సరే! కానీ ఫెయిల్ మాత్రం కాకు" అంది తల్లి.

## గొప్పగా ఉంటుందని..

"నాన్నా, ఇవాళ మా కాలేజీలో ఫంక్షన్ ఉంది. కారు తాళాలు ఇస్తావా? నాలుగు లక్షల కారులో వెళితే చాలా గొప్పగా ఉంటుంది. మా స్నేహితులందరూ నా గురించే మాట్లాడుకుంటారు" అన్నాడు తండ్రితో.

"అలాగా, అయితే ఈ యాభై రూపాయలు తీసుకొని బస్సులో వెళ్లు. నాలుగు లక్షల కార్లో వెళ్లడం కన్నా ముప్పై లక్షల బస్సులో వెళ్తే మరింత గొప్పగా ఉంటుంది. మీ స్నేహితులు ఇంకా గొప్పగా చెప్పుకుంటారు" అన్నాడు తండ్రి.

## రుచి..

భర్త తీరిగ్గా కూర్చుని పిస్తాపప్పు తింటున్నాడు.



ఇంతలో భార్య వచ్చి "ఏమండీ! నాక్కూడా ఒక పిస్తా ఇవ్వండి. నేనూ రుచి చూస్తాను" అంది.

ఒక్కటంటే ఒక్కటే ఇచ్చాడు. అది తినేసి మళ్లీ ప్లీజ్ ఇంకొక్కటి అంది.

"మిగతావాటి రుచి కూడా అలాగే ఉంటుంది.." అన్నాడు, భర్త.

## తగ్గిపోయింది..

"ఏమండీ, నాకు చెస్ట్‌లో చాలా నొప్పిగా ఉంది. హార్ట్ ఎటాక్ ఏమోనని సందేహంగా ఉంది. తొందరగా అంబులెన్స్‌కి ఫోన్ చేయండి" అంది భర్తతో కంగారుగా.

"సరే..సరే.. ఇప్పుడే చేస్తాను. ఒక్కసారి నీ మొబైల్ పాస్‌వర్డ్ చెప్పు" అన్నాడు.

"వద్దులెండి... ఇందాకటి కన్నా ఇప్పుడు కాస్త నెమ్మదించింది" అంది.

అంతేకానీ మొబైల్ పాస్‌వర్డ్ మాత్రం చెప్పలేదు సుమా!

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు.. వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080.**

**sunmagvaartha@gmail.com**

## 'సంఘీ' భావం



# కలవరపెడుతున్న ఎల్‌నినో

ఈసారి వర్షాభావంతో కరవు ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం వల్ల అనేక సమస్యలు ఏర్పడ్డాయి. సామాన్యుడి జీవనంపై అధిక ప్రభావం చూపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వాతావరణంలో వస్తున్న మార్పులు మరిన్ని సమస్యలను కొనితెచ్చేలా ఉన్నాయి. పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన తీవ్రమైన ఉష్ణోగ్రత ప్రభావం వల్ల ఈసారి సూపర్ ఎల్‌నినో ప్రభావం తప్పనిసరిగా భారతదేశంలో రుతుపవనాలపై చూపించే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ప్రతి రెండు నుంచి ఏడేళ్ల కాలంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడతాయని స్పష్టమౌతోంది. ఈ పరిస్థితులు జూన్‌కు ముందు నుంచే ఏర్పడితే కొంత ప్రభావం తగ్గి సకాలంలో రుతుపవనాలు వచ్చి వర్షాభావ పరిస్థితుల నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. అయితే ఈసారి మే చివరి వారం గాని, జూన్ మొదటి వారంలో గాని ఈ పరిస్థితులు రావడం వల్ల రుతువవనాలపై స్పష్టమైన ప్రభావం కనిపించే ప్రమాదం ఉందని తెలుస్తోంది. సూపర్ ఎల్‌నినో వల్ల వర్షాలు గణనీయంగా తగ్గి కరవు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుందని వాతావారణ నిపుణులు తెలుపుతున్నారు,

గతంలో సంభవించిన ఎల్‌నినోల చరిత్ర పరిశీలిస్తే.. తీవ్రత తొమ్మిది నెలల నుంచి ఏడాది వరకూ ఉంటుంది. మధ్య, తూర్పు పసిఫిక్ మహా సముద్రంలో 2016లో బలమైన ఎల్‌నినో ఏర్పడింది. పసిఫిక్ మహాసముద్రంలో చోటు చేసుకుంటున్న ఉష్ణోగ్రతల మార్పులు ప్రపంచ దేశాలతో పాటు ముఖ్యంగా భారతదేశాన్ని కలవరపెడుతున్నాయి. వాతావరణ పరిస్థితులు వేగంగా ఎల్‌నినో దిశగా మారుతున్నాయని అంతర్జాతీయ వాతావరణ సంస్థలతో పాటు భారత్‌కు చెందిన ఇన్‌కాయిస్ తాజా బులెటిన్‌లో హెచ్చరించింది. వేసవికాలం తర్వాత ఇండియన్ సమ్మర్ మాన్‌సూన్ ప్రారంభమవుతుంది. దీనికి వేసవిలో వేడిమే కారణం. ఉత్తర భారతదేశంలో రాజస్థాన్ ఆ పరిసర ప్రాంతాల్లో తీవ్రమైన వేడి ఉండటం వల్ల అల్పపీడనం ఏర్పడుతుంది. అలాగే దక్షిణ భారతదేశం దాటి భూమధ్య రేఖకు అవతల ఉన్న ఉన్న ప్రాంతానికి శీతాకాలం ఏర్పడుతుంది. మస్కారన్ ఐలాండ్స్ అనే ప్రాంతంలో భూమధ్యరేఖకు దిగువగా బలమైన అధిక పీడన వాతావరణ పరిస్థితులు ఉంటాయి. అధిక పీడనం నుంచి ఉత్తర భారత్‌లోని అల్పపీడన ప్రాంతం వైపు గాలుల ప్రవాహం ఉంటుంది. పసిపిక్, హిందూ మహాసముద్రం, బంగాళఖాతం మీదుగా వేడిగాలులు ప్రయాణం చేసి రావడం వల్ల చాలా తేమను తీసుకువచ్చి నాలుగు నెలల పాటు భారత భూభాగంలో వర్షాలు పడుతుంటాయి. అయితే రుతుపవనాలపై ప్రభావం చూపించే రెండు వాతావరణ పరిస్థితులు ఉంటాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న జలాల ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీలు పెరిగినా అది రుతు పవనాలపై ప్రభావం చూపిస్తుంది. ముఖ్యంగా పసిఫిక్ మహాసముద్రం తర్వాత ఆ పవనాలు హిందూ మహా సముద్రం మీదుగా వస్తాయి. దీనిని ఇండియన్ ఓషియన్ డైపోల్ (ఐవోడీ) అని చెబుతారు. తూర్పు వైపు వేడిగా ఉండి, పశ్చిమ వైపు చల్లగా ఉన్నప్పుడు నెగిటివ్ ఐవోడీ అంటారు. దీనివల్ల రుతుపవనానాల మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. పశ్చిమాన వేడి జలాలు ఉండి, తూర్పులో చల్లని జలాలు ఉన్నట్లయితే దానిని పాజిటివ్ ఐవోడీగా పిలుస్తుంటారు. దీనివల్ల ఎల్‌నినో ప్రభావం తటస్థం చేసి రుతుపవనాలు సాధారణంగా ఉంటాయి. ప్రస్తుతం ఎల్‌నినో ఐవోడీ తటస్థంగా ఉన్నప్పటికీ మే చివరి నాటికి ఇది ఎల్‌నినోగా మారొచ్చని ఐఎండీ అంచనా వేస్తుంది. సాధారణంగా మన ప్రాంతంలో జూన్–సెప్టెంబరు వరకు రుతుపవనాల ప్రభావం ఉంటుంది. ఈ సమయంలో ఏ నెలలో అయినా ఎన్‌నినో, నెగిటివ్ ఐవోడీ పరిస్థితులు ఏర్పడితే వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి. మొదటి నుంచి ఎల్‌నినోగా కొనసాగుతుంటే రుతుపవనాలు ఆలస్యమవ్వొచ్చు. అనుకున్న సమయానికి వర్షాలు పడకపోవడం లాంటి పరిస్థితులు ఉంటాయి. తెలంగాణలో జులై, ఆగస్టు నెలల్లో ఎక్కువగా వర్షం పడుతుంది. ఎల్‌నినో ప్రభావం ఉన్నట్లయితే ఈ పరిస్థితుల్లో మార్పు వస్తుంది. ఒక్కోసారి జూన్‌లో భారీ వర్షాలు పడి, జులై అంతా వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయి. అయితే ఉత్తర భారతంలో ఏర్పడే ఉష్ణోగ్రతల్లో మార్పు వల్ల పసిఫిక్ మహాసముద్రం, హిందూ మహాసముద్రాల నుంచి బంగాళాఖాతం మీదుగా వేడిగాలులు ప్రయాణం చేస్తే వచ్చే తేమ కారణంగా వర్షాలు పడే అవకాశం ఉంటుంది. ఏదిఏమైనా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉండాలని వాతావరణ నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

డా॥ ఎన్.బి.సుధాకర్ రెడ్డి

# జీవితాన్ని వెలిగించే మహా 'ప్రాణ' దానం

**మనిషి జన్మలో అత్యంత విలువైనది ప్రాణం. తల్లి తన గర్భంలో బిడ్డకు ప్రాణం పోస్తుంది. వైద్యులు తమ జ్ఞానం, సేవతో ప్రాణాలను కాపాడుతారు. అయితే, మరణం తర్వాత కూడా ఇతరులకు ప్రాణం అందించే మహత్తర అవకాశం మనిషికే లభించింది - అదే అవయవ దానం.**

ఒక వ్యక్తి ఈ లోకం విడిచి వెళ్తున్నప్పుడు, తన అవయవాలను దానం చేస్తే కనీసం ఎనిమిది మందికి కొత్త జీవితం లభిస్తుంది. కంటి దానం ద్వారా చూపు లేని వారికి వెలుగు, గుండె దానం ద్వారా మరొకరి గుండె మళ్లీ కొట్టుకోవడం, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు.. ఇలా ఒక జీవితం అనేక జీవితాలను వెలిగిస్తుంది. ఇది కేవలం దానం కాదు- జీవితాన్ని పంచడం.

మన సమాజంలో చాలామంది అవయవ దానం గురించి అపోహలు, భయాలు కలిగి ఉంటారు. కానీ శాస్త్రీయంగా, చట్టపరంగా ఇది సురక్షితమైనది.

ఒక వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయిన తరువాత, కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలను సేకరించి అవసరమైన వారికి మార్పిడి చేస్తారు. ఇది పూర్తిగా పారదర్శకంగా జరుగుతుంది. అవయవ దానం ఒక వ్యక్తి మానవతా విలువలను ప్రతిబింబించే గొప్ప నిర్ణయం.

మనం జీవించి ఉన్నప్పుడు చేసే సహాయం ఒక పరిమితి వరకు మాత్రమే ఉంటుంది. కానీ మరణం తరువాత కూడా మనం ఎవరికో ఊపిరిగా, ఎవరికో హృదయంగా, ఎవరికో కళ్లలో వెలుగుగా మారగలిగితే- అది నిజమైన అమరత్వం.

"మరణం అనివార్యం.. కానీ మరణం తరువాత కూడా జీవించడం సాధ్యం.."

ఈ భావనను నిజం చేసే మార్గం అవయవ దానం. మనం తీసుకెళ్లేది ఏమీ లేదు.. కానీ ఇచ్చి వెళ్లేది అనేక జీవితాలను మార్చగలదు.

మన కుటుంబంతో కలిసి అవయవ దానం గురించి చర్చించాలి. దానికి సిద్ధంగా ఉండాలి. ఒక చిన్న నిర్ణయం.. ఎనిమిది కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతుంది.



## ప్రాణదానం పరమ పవిత్రం

మన జీవితానికి అర్థం ఇవ్వాలంటే - అవయవ దానం గురించి ఆలోచించాలి, ఆచరించాలి. ఇది భారతీయ పురాణ కాలం నుంచి ఉంది. వైద్య ఆరోగ్య రంగంలో వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల అవయవాల మార్పిడి చాలా సులభంగా మారుతుంది. సురక్షితంగా కూడా ఉంది.

## పురాణాల్లో మహోన్నత సందేశం

మన భారతీయ సంస్కృతిలో 'దానం' అనేది అత్యున్నతమైన పుణ్యకార్యంగా భావించబడింది. అన్నదానం, విద్యాదానం, భూదానం, గోదానం, వస్త్ర దానం.. వంటి అనేక దానాలు చేస్తుంటారు. అయితే ప్రాణం రక్షించే లేదా ఊపిరి పోసే అవయవ దానం అత్యంత విశిష్టమైనది.

ఆధునిక వైద్యశాస్త్రం అభివృద్ధితో ఇది ప్రాణాలను కాపాడే మహత్తర మార్గంగా మారింది. అయితే, ఈ భావన కొత్తది కాదు మన పురాణాల్లోనే ఈ త్యాగస్ఫూర్తికి ప్రతీకలుగా నిలిచిన అనేక ఉదాహరణలు ఉన్నాయి.

### వినాయకుడి కథ

మన సమాజంలో వినాయకుడికి గొప్ప స్థానం ఉంది. ఆయన కథలో ఒక గొప్ప సందేశం దాగి ఉంది.

పూర్వం పార్వతీ దేవి స్నానం చేయడానికి వెళుతూ ఒక వినాయకుడి బొమ్మను చేసి ప్రాణం పోసి కాపలా ఉంచుతుంది. అదే సమయంలో..

ఇంటికి వచ్చిన శివుడిని వినాయకుడు అడ్డగిస్తాడు.

శివుడు కోపంతో వినాయకుడి తలను తొలగిస్తాడు. తర్వాత, పార్వతి దేవి ఆర్తనాదంతో ఆయనకు తిరిగి ప్రాణం పోయడానికి ఏనుగు తల అమర్చి బతికిస్తాడు.

ఈ ఘటనను మనం ప్రాచీన అవయవ మార్పిడి భావనగా చూడవచ్చు. ఇది ఒక జీవికి కొత్త అవయవం అమర్చడం ద్వారా జీవం ఇవ్వగలమనే సందేశాన్ని ఇస్తుంది.

## దధీచి మహర్షి త్యాగం

ఒకసారి దేవతలు, రాక్షసులకు యుద్ధం వచ్చింది. రాక్షసులను ఎదుర్కోవడానికి తగిన ఆయుధాలు అవసరమయ్యాయి.

ఆ సమయంలో దధీచి మహర్షి తనకు తాను అగ్నికి ఆహుతి అయి తన ఎముకలను దేవతల రక్షణ కోసం అర్పించారు. ఆయన శరీరం నుంచి తీసుకున్న ఎముకలతో ఇంద్రుడు వజ్రాయుధాన్ని తయారు చేసి అసురులను సంహరించాడు.


మన శరీరం కూడా సమాజానికి ఉపయోగపడాలి అనే గొప్ప త్యాగం, స్ఫూర్తి ఇందులో దాగి ఉంది. ఈ



భావన ఆధునిక అవయవ దానానికి అత్యంత సమీపంగా ఉంటుంది.

## పావురాన్ని కాపాడిన శిబి చక్రవర్తి

శిబి చక్రవర్తి ఒక పావురాన్ని కాపాడటానికి ఆయన



తన శరీరం నుంచి మాంసాన్ని కోసి డేగకు ఇచ్చాడు. ఆకలి తీరిన డేగ పావురాన్ని ప్రాణాలతో వదిలి వెళ్ళింది. మరొక జీవిని రక్షించడానికి మన శరీరం కూడా అర్పించాలి.. అనే పరమ దయా గుణం.

## అవయవ దానం-ఆధునిక సమాజానికి అవసరం

పురాణాల్లో చెప్పబడిన ఈ కథలు కేవలం కథలు మాత్రమే కావు. ఇవి మనకు ఒక గొప్ప నీతిని నేర్పుతాయి. మన శరీరం మనకే కాక సమాజానికి కూడా ఉపయోగపడాలి. మరణానంతరం కూడా మనం ప్రాణాలను కాపాడవచ్చు.

త్యాగం ద్వారా మనిషి అమరుడవుతాడు. ఇప్పటి రోజుల్లో, గుండె, కాలేయం, కిడ్నీలు, కళ్ళు వంటి అవయవాలు దానం చేసి అనేకమంది ప్రాణాలను రక్షించవచ్చు. ఒక వ్యక్తి అవయవ దానం చేస్తే, ఎనిమిది మందికి పైగా ప్రాణాలను కాపాడగలడు.

పురాణాల్లోని వినాయకుడు, దధీచి మహర్షి, శిబి చక్రవర్తి వంటి మహనీయులు మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇచ్చారు.

**"మన శరీరం కూడా ఒక దానం కావచ్చు"**

అందుకే మనం కూడా ఈ మహోన్నత భావనను ఆచరణలో పెట్టాలి.

అవయవ దానం ద్వారా మరణానంతరం కూడా మనం జీవించి ఉంటాం.. ఇది కేవలం దానం కాదు, జీవదానం.

## అవయవ దానం

ఇప్పుడు మనిషి శరీరంలో పనికిరాని అవయవాలను తొలగించి, మరొకరి అవయవాలను అమర్చ వచ్చు. దీనితో స్వచ్ఛందంగా అవయవాలు దానం చేసే ప్రక్రియకు డాక్టర్లు శ్రీకారం చుట్టారు.

అవయవ దానం అనేది మరణించిన లేదా మరణించబోయే వ్యక్తి శరీర అవయవాలు వేరొకరికి అమర్చడానికి ఇవ్వడం. దీని వలన ఆయా అవయవాలు విఫలమై రోగగ్రస్తులైనవారు పునర్జీవితులవుతారు. దీనిపై ప్రభుత్వం ప్రారంభించిన 'జీవనదానం' కార్యక్రమం మార్గదర్శకాలు రూపు దిద్దుకుంటూ ఉంది. అవయవ దానం ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుంది.

**సజీవ దానం:** బతికున్నవారు ఆరోగ్యంగా ఉండి అవయవాన్ని లేదా భాగాన్ని దానం చేయడం. రక్తదానం, ఒక మూత్రపిండం, కాలేయంలో కొంత భాగం దానం చేయడం. దీనిలో దాత తరువాత కూడా ఆరోగ్యంగా కొనసాగవచ్చు.

**జీవన్మృతి దానం:** దీనిలో వ్యక్తి మరణానంతరం అవయవాలు దానం చేయడం. అయితే వ్యక్తి మరణించిన కారణం అనుసరించి అవయవాలు ఉపయోగించడం ఉంటుంది. దీనికి సిద్ధపడినవారు తమ పేరు నమోదు చేసుకోవలసి వస్తుంది. వ్యక్తి

మరణానంతరము కుటుంబ సభ్యులు కూడా అవయవ దానం అంగీకరించవచ్చు.

## దానం చేయగల అవయవాలు

చనిపోయాక మనిషి తన శరీరంలోంచి 200 అవయవాలు, కణజాలాన్ని దానం చేయవచ్చు. కళ్ళు, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, క్లోమం, పెద్ద పేగు, చిన్నపేగులు, ఎముకలు, మూలుగను దానం చేయవచ్చు. ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత సగటున ఆరేడుగురికి జీవితం ఇవ్వొచ్చు. సహజ మరణం తరువాత ప్రాణవాయువు (ఆక్సిజన్) సరఫరా నిలిచిపోవడంతో కీలక అవయవాలు పనికి రాకుండా చనిపోతాయి. కేవలం కంటి కార్నియా, చర్మం, ఎముక, గుండె కవాటాలు, రక్తనాళాలు వంటి కణజాలాలు ఉపయోగిస్తారు. జీవన్మృతుల (బ్రెయిన్ డెడ్) వ్యక్తుల నుంచి గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయం, క్లోమం, పేగులు వంటి కీలక అవయవాలు సేకరించవచ్చు.

## చర్మ దానం

జీవన్మృతుల నుంచి చర్మం సేకరించి చర్మం కాలిన గాయాలకు అమర్చే 'గ్రాఫ్టింగ్' ప్రక్రియ ద్వారా కొత్త జీవితం అందిస్తున్నారు. సేకరించిన చర్మాన్ని ఐదు సంవత్సరాల వరకు స్కిన్ బ్యాంకులో భద్రపరచి ఉపయోగించుకునే వీలుంది. తక్కువ గాయాలతో వచ్చిన బాధితులకు వారి శరీరంలోనించే వీపు, తొడల నుంచి చర్మాన్ని తీసి కాలిన చోట అతికించి చికిత్స చేస్తారు. తీవ్ర గాయాలైతే స్కిన్ బ్యాంకులోని చర్మంతో రోగికి తాత్కాలికంగా జీవ రక్షణ కవచంలా గ్రాఫ్టింగ్ చేస్తారు.

మూడు వారాల తరువాత చర్మం ఊడిపోయి కొత్త చర్మం వస్తుంది. 60 శాతం గాయాలయిన వారు కూడా కోలుకున్నట్లు వైద్యులు తెలియచేసారు. హైదరాబాదులోని ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రిలో చర్మ బ్యాంకు నెలకొల్పి పేదరోగులకు సైతం చికిత్స అందిస్తున్నారు.

## ఎప్పుడు సేకరిస్తారు?

బతికి ఉన్నప్పుడు సజీవ దానం 18 సంవత్సరాలు నిండినవారు ఎవరైనా చేయవచ్చు. జీవనమృతుల విషయంలో వయస్సు, లింగం వంటి నిర్దేశికాలు లేవు. చనిపోయాక అవయవాల మార్పిడి గంటల్లో జరిగిపోవాలి. గుండె ఆగి చనిపోతే కళ్ళు, గుండె కవాటాలు వంటి వాటిని 6 నుంచి 24 గంటల్లోపు సేకరించవచ్చు.

రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన కేసుల్లో ఎక్కువగా బ్రెయిన్ డెత్‌గా ప్రకటిస్తారు. వీరిని వెంటిలేటర్ నుంచి బయటకు తీసుకొచ్చేలోపు అవయవాలు సేకరించవచ్చు. బయటకు తీసుకొచ్చాక గుండె అయితే నాలుగైదు గంటలు, కాలేయం 8-10 గంటలు, మూత్రపిండాలు 24 గంటల్లోపు సేకరించాల్సి ఉంటుంది.



**ఎవరు ఇవ్వొచ్చు:** బతికుండగానే అవయవాలు రక్త సంబంధీకులకు దానం చేయవచ్చు. రక్త సంబంధీకులు అంటే అమ్మా నాన్న, సోదరి, పాప, బాబు, భార్య. ఇందుకు ప్రభుత్వ అనుమతి అక్కర్లేదు. బతికుండగానే బంధు, మిత్రులకు అవయవ దానం చేసేటప్పుడు మాత్రం ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరి. ఆరోగ్యవంతులైన అన్ని వయసులవారు అవయవ దానానికి అర్హులే. తన మరణానంతరం శరీరంలోని భాగాలు ఉపయోగించుకునేలా అంగీకారం తెలపవచ్చు. బంధుమిత్రుల ఆమోదంతో వీరి శరీరంలోని అవయవాలను మార్పిడి కోసం సేకరిస్తారు.

## బ్రెయిన్ డెడ్ అంటే?

ప్రమాదాలలో కోలుకోలేని విధంగా తలకి గాయం అయినప్పుడు, ప్రాణవాయువు అందక మెదడు, తలలోని ఇంకా మిగిలిన భాగాలు దెబ్బతింటాయి. ఆ పరిస్థితిలో మెదడు భాగం పని చేయకపోయినా, కీలక అవయవాలు ప్రత్యేక చికిత్స, రక్త సరఫరాతో పని చేస్తుంటాయి. వ్యక్తి ఈ పరిస్థితిలో సాధారణ జీవనం సాగించలేడు. దీనిని బ్రెయిన్ డెత్ అంటారు. ఆ కీలక అవయవాలని ఇతర వ్యక్తులకు అమర్చుతారు.

బ్రెయిన్ డెత్‌ను వైద్యుల బృందం అంటే చికిత్స చేస్తున్న వైద్యుడు, వైద్యశాల అధికారి, న్యూరాలజిస్ట్, వేరే వైద్యశాలకు చెందిన వైద్యుడు కలిసి నిర్ధారిస్తారు. అయితే బతికుండగా మూత్రపిండం వంటి దానం చేసినవారు ఆరోగ్యమైన జీవన శైలి అలవరుచుకోవాలి, వైద్యులను సంప్రదించాలి. అవయవ గ్రహీతలు క్రమం తప్పకుండా వైద్య సలహాపై మందులు వాడవలసి వస్తుంది.

## ఫ్రాన్స్‌లో తప్పనిసరి..

2017లో ఫ్రాన్స్ అవయవ దానాన్ని తప్పనిసరి చేసింది. ఇష్టం లేదని ప్రభుత్వానికి ముందు తెలియచేయకపోతే వైద్యులు

అవయవాలు సేకరిస్తారు. దీనిని మిగిలిన దేశాలు కూడా అనుసరిస్తున్నాయి. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవయవ దానంపై అవగాహన పెంపొందించడానికి, నమోదు వంటి కార్యక్రమాలకు చర్యలు తీసుకుంటున్నాయి. రకరకాల అపోహల వలన, కుటుంబ సభ్యులు ముందుకు రాకపోవడంతో అవయవ దాతల కొరత తీవ్రంగా ఉంది. 1994లో మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం తెచ్చారు. 2011లో దానికి సవరణలు చేసారు.

అవయవ, కణజాల మార్పిడి సంస్థ (ఎన్.ఓ.టి.టి.ఓ) పర్యవేక్షిస్తుంది. తెలుగు రాష్ట్రాలలో అవయవ దానానికి 'జీవన్ దాన్', ఇంకా మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు దశాబ్దం పైగా కృషి చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అవయవాలను త్వరితగతిన తరలించేందుకు 'గ్రీన్ కారిడార్' ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాలు దాతల అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో జరపాలని నిర్ణయించింది. దీనికి కలెక్టర్ లేదా ప్రభుత్వ ప్రతినిధి హాజరు అవుతారు.

## దాతల నమోదు

అవయవ దానం చేయదలచుకున్నవారు జాతీయ స్థాయిలో నేషనల్ ఆర్గన్ అండ్ టిష్యూ ట్రాన్స్ప్లాంట్ అసోసియేషన్, ప్రాంతీయ స్థాయిలో 'జీవనదాన్' కార్యక్రమంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరచిన తరువాత ప్రత్యేక సంఖ్యతో డోనర్ గుర్తింపు కార్డు వస్తుంది. ఈ నమోదు సంగతి వ్యక్తి తన కుటుంబ సభ్యులకు తెలియచేయాలి.

ఎన్.ఓ.టి.టి.ఓ ప్రకారం 2014లో 6916 అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగాయి. 2022 నాటికి 16000కి చేరాయి.




83 శాతం కేసులలో అవయవాలను జీవించి ఉన్న వ్యక్తుల నుంచి సేకరిస్తున్నారు.

మరణించిన దాతలు 2014లో 408 మంది, 2023లో 1000 పైగా ఉన్నారు.

జీవనదాన్ 2025 గణాంకాల ప్రకారం 201 మంది దాతల వలన 732 మంది లబ్ధి పొందారు. వయస్సుల వారీగా చూస్తే 6-20 మధ్య 8 మంది; 21-30 మధ్య 29 మంది; 31-40 మధ్య 31 మంది; 41-50 మధ్య 51 మంది ఉన్నారు.

టాలీవుడ్ నటుడు జగపతిబాబు 2022 ఫిబ్రవరి 12న తన 60వ పుట్టినరోజు నేపథ్యంలో ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. సికిందరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో 2022 ఫిబ్రవరి 11న ఏర్పాటు చేసిన అవయవదాన అవగాహన సదస్సుకు చీఫ్ గెస్టుగా విచ్చేసిన జగపతిబాబు తన మరణానంతరం అవయవ దానం చేస్తున్నట్టు ప్రకటించారు. వంద మంది అభిమానులు సైతం ప్రమాణ పత్రంపై సంతకం చేసారు.




1954లో మొట్టమొదటిసారిగా డాక్టర్ జోసఫ్ ముర్రే అనే వ్యక్తి అవయవ మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. రొనాల్డ్ లీ హెరిక్ అనే వ్యక్తి తన మూత్రపిండాన్ని తన కవల సోదరుడికి ఇచ్చాడు.

## అపోహాలు వీడాలి

ఇండియాలో అవయవ దానం గురించి ఉన్న మూఢనమ్మకాలు సమాజ అభివృద్ధికి పెద్ద అడ్డంకిగా మారుతున్నాయి. పోస్టుమార్టం చేసినా, బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలు తొలగించినా శరీరం పాడవుతుందనే అపోహ ఇప్పటికీ కొందరిలో గూడు కట్టుకుని ఉంది. అవయవ దానం చేస్తే పునర్జన్మ ఉండదనే మూఢ నమ్మకం కూడా కొందరిలో వెళ్ళూనుకుని ఉంది.

ఇవన్నీ శాస్త్రీయ ఆధారంలేని భావనలు. ఈ నేపథ్యంలో సమాజంలో అవగాహన పెంపు అత్యంత అవసరం. మొదటగా, పోస్టుమార్టం అనేది ఒక వైద్య-న్యాయ ప్రక్రియ. ఇది మరణానికి కారణాలు తెలుసుకోవడానికే చేయబడుతుంది. దీనివల్ల శరీరానికి అవమానం కలగదు అన్న అవగాహన పెంచాలి. అలాగే, బ్రెయిన్ డెత్ అంటే వైద్యపరంగా మరణం. ఈ సమయంలో అవయవాలు మాత్రమే



కొంతసేపు పనిచేస్తాయి. ఈ అవయవాలను దానం చేయడం ద్వారా మరొకరి ప్రాణం నిలబెట్టవచ్చు. దీని వల్ల మరణించినా మరొకరి రూపంలో జీవించవచ్చు.. అన్న సానుకూల దృక్పథం కలిగించాలి.

పునర్జన్మ లేదా ఆధ్యాత్మిక విశ్వాసాలు వ్యక్తిగతమైనవి. అవయవ దానం వాటిని ప్రభావితం చేస్తుందనే శాస్త్రీయ ఆధారం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా లోపం, ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం, అపోహలు, ఇవే ప్రధాన కారణాలు. చాలామంది కుటుంబాలు భావోద్వేగంగా నిర్ణయాలు తీసుకుంటారు. సరైన సమాచారం అందకపోవడం వల్ల మంచి అవకాశాలను కోల్పోతున్నారు.

## పరిష్కార మార్గాలు

**1. అవగాహన కార్యక్రమాలు:** ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాలలు, కళాశాలల్లో అవయవ దానం గురించి పాఠ్యాంశాలు చేర్చాలి.

**2. వైద్యుల పాత్ర:** డాక్టర్లు, నర్సులు కుటుంబ సభ్యులతో మాట్లాడి బ్రెయిన్ డెత్ గురించి స్పష్టంగా వివరించాలి. వారి సందేహాలను శాంతంగా నివృత్తి చేయాలి.

**3. మీడియా , సోషల్ మీడియా ప్రభావం:** సినిమాలు, టీవీ షోలు, సోషల్ మీడియా ద్వారా అవయవ దానం ప్రాముఖ్యతను చాటి చెప్పాలి. అవయవ దానం వల్ల ప్రాణాలు దక్కిన వారి కథలు ప్రజలకు చేరాలి.

**4. మతపరమైన నాయకుల సహకారం:** చాలా మంది మత విశ్వాసాలను ఆధారంగా తీసుకుంటారు. అందుకే మత పెద్దలు అవయవ దానానికి మద్దతు ఇవ్వాలి. ఇది సేవా భావంగా భావించాలి.

**5. విజయ కథల ప్రచారం:** అవయవ దానం వల్ల కొత్త జీవితం పొందిన వ్యక్తుల కథలు ప్రజల్లో నమ్మకం పెంచుతాయి. "ఒకరి మరణం అనేక ప్రాణాలకు జీవం" అనే భావనను బలంగా చాటాలి.

**6. చట్టాలపై అవగాహన:** భారతదేశంలో అవయవ దానం చట్టబద్ధం. ప్రభుత్వం దీనికి ప్రత్యేక మార్గదర్శకాలు అమలు చేస్తోంది. ప్రజలకు ఇవి తెలిసేలా చేయాలి.

## సమాజం మారాల్సిన సమయం

అవయవ దానం అనేది కేవలం వైద్య ప్రక్రియ కాదు. ఇది ఒక మహా దానం. మనం మరణించిన తర్వాత కూడా ఇతరులకు జీవం ఇవ్వగలిగే గొప్ప అవకాశం. మూఢనమ్మకాలను పక్కనపెట్టి శాస్త్రీయ దృక్పథాన్ని స్వీకరించాలి. సమాజంలో మార్పు ఒక్క రోజులో రాదు. కానీ చిన్న చిన్న ప్రయత్నాలు పెద్ద ఫలితాలను ఇస్తాయి. దీనిపై ప్రతి వ్యక్తి అవగాహన పెంచుకుంటే, ప్రతి కుటుంబం ధైర్యంగా ముందుకు వస్తే అవయవ దానం సాధారణంగా మారుతుంది. "జీవితం ముగిసినా, జీవం ఇవ్వొచ్చు" అనే భావన ప్రతి హృదయంలో నిలవాలి.

## స్ఫూర్తినిచ్చే అంశాలు

మరణానంతరం తమ ప్రియమైన వారి అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చే కుటుంబ సభ్యులు (ఉదా: బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలను దానం చేయడం) నిజమైన స్ఫూర్తిగా నిలుస్తారు.

2014లో 100 నిమిషాలు మాత్రమే జీవించిన శిశువు అవయవాలను దానం చేయడం, అలాగే 2022లో 100 యేళ్ల వయసులో కాలేయాన్ని దానం చేసిన ఇటాలియన్ మహిళ వంటివారు అవయవ దానానికి పెద్ద స్ఫూర్తి.

**ప్రజల్లో అవగాహన:** అవయవ దానం గురించి ప్రజలలో అవగాహన కల్పించే ప్రముఖ నెఫ్రాలజిస్టులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు (ఉదా: జీవన్ దాన్) దీనికి స్ఫూర్తిగా నిలుస్తారు.

**సామాజిక స్ఫూర్తి:** రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారి కుటుంబాలు తమ వారి అవయవాలను దానం చేయడం ద్వారా ఎనిమిది మందికి ప్రాణభిక్ష పెడుతున్నారు. అవయవ దానం అనేది చనిపోతూ మరొకరికి ప్రాణం పోసే ఒక గొప్ప త్యాగం, దీనికి స్ఫూర్తినిచ్చే ప్రతి వ్యక్తి కూడా ఒక గొప్ప మానవతావాది.



## ఈ వారం కవిత్వం

# నా మల్లి

తూర్పు దిక్కున సూరీడు పురుడుపోసుకోక ముందే
నన్ను నిద్రలేపి నా కళ్ళకేసి చూసి
నా మొగంలో వెలుగు
నింపుతాది నా బంగారు మల్లి.
అన్నార్తుల ఆకలి తీర్చడానికి నేను చేనుకాడికి
ఎలబారుతా వుంటే నాకు ఎదురేగి
నా గుండెల్లో ఉత్సాహాన్ని నింపుతాది నా గడుసు మల్లి.
చేనులో చెమటోర్చి
అలసిసొలసిన నా దేహానికి
చేను గట్టునుండే చెట్టు
కింద
నా కడుపులో చల్ల
నింపుతాది..
నా మంచి మల్లి.
పడమటి దిక్కున సూరీడు
కనుమరుగయ్యే యాలకి



ఇంటికాడికి వస్తానే వెచ్చవెచ్చని నీళ్ల
నాపై కుమ్మరించి
నన్ను సేదతీరుస్తాది నా చక్కని మల్లి.
సందెటేల గూటిలో దీపమెట్టే యాలకి నకనకలాడే
నా కడుపులోకి వేడివేడి కూర కలిపిన
కూడు కొసరి కొసరి నింపి
నా కడుపు చల్లారుస్తాది నా ప్రేమ మల్లి.
పుడమి ఒడిలో దుక్కి దున్ని, నారు పోసి
అలసిపోయిన నా దేహానికి
రాతిరేళ నులకమంచంపై నా దేహంలో ఏకమై
నన్ను పరవశింపచేస్తాది నా సొగసు మల్లి.
ఇదంతా ఒకప్పటి మాట.
ఎందుకంటే,
బీడుబారిన భూమిలో నన్ను ఒంటరిని చేసి
శాశ్వతంగా నింగికి వెళ్ళిపోయింది నా మనసు మల్లి.

– దేవీప్రసాద్ ఒబ్బు

# అప్పుడప్పుడు!

అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది
కాల ప్రవాహాన్ని ఎదురీది
గడచిన మజిలీలకు మళ్ళీ చేరాలని
మార్పు చేర్పులేవో చెయ్యాలని
కాదుగానీ
ఇంకొన్నిసార్లా
మధురిమల్ని
ఆస్వాదించాలని!
మళ్ళీ
బుజ్జాయినయిపోతే
బాగుండని
ఉయ్యాలతొట్లో జాలిగా ఊగాలనో
గుర్రుపెట్టి నిద్దురోవాలనో కాదుగానీ
పాపాయిగా నేనుపెట్టే కేరింతలకు
అమ్మ నవ్వే నవ్వులు
ఇంకోసారి చూడాలనీ
తప్పటడుగులేస్తూ
నాన్నవేలు పట్టుకొని
మరొక్కసారి తనతో నడవాలనీ!
పిల్లాడై బడికెళ్ళగలిగితే బాగుండని
బాధ్యతలు
తప్పించుకోవాలని కాదుగానీ
బతుకుసేద్యంలో..
చెట్టుకు పుట్టకొకరైన
అలనాటి ప్రియ మిత్రులతో
ఇంకాస్త ఎక్కువ సమయం గడపాలనీ!
తొలి కొలువు చేసిన నెలకి



తిరిగి వెళ్ళగలిగితే
బాగుండని..
తక్కువ పనులతో
తిరగాలని కాదుగానీ
మొదటి జీతం
తీసుకున్న ఆనందం
ఇంకొక్కసారి
అనుభవంలోకి తెచ్చుకోవాలనీ!
కన్న పిల్లలు ఇంకొన్ని రోజులు
పసిపాపల్లా ఉండిపోతే బాగుండని
తొందరగా పెరిగేస్తున్నారని కాదుగానీ
బుడినడకల బుడతలైతే
మరికొన్ని రోజులు వాళ్ళతో
ఆడుకోవచ్చనీ!

– రవి కిషోర్ పెంట్రాల

# ఈర్ష్య ఓ పరీక్ష

కాలానికి సైతం
నచ్చని నిజమొకటి ఉంది నాలో.
దాని ఈర్ష్య ఓ పరీక్ష.
కొలిచినా చిన్న చూపే.

రుచిని వేధిస్తు ఆకలిని నిషేధిస్తుంది.
ఆశకు విలువ లేకుండా చేసి
మంచిని నటిస్తూ దేన్నీ రానివ్వదు.
బలగాలతో బలం చూపుతుంది.

ఏదో ఓ రోజు.. తను పల్లకీగా
మారుతానని తెలిసే..
ఈ లోపల ఇదంతా
ఆ ఆటలా ఓ నాటకం.

కష్టం, సహనం, నమ్మకం, ధైర్యం
ఎవరి ముఖంలో చూసినా
లొంగుబాటు ధోరణి దాని నైజం.

ఎదురు తిరిగి దాడి చేస్తేనే
కాలం తనతో సమానంగా
నిన్ను నీ పేరుతో గౌరవించేది.

– చందలూరి నారాయణరావు

# ప్రకృతి అందాలు

ప్రకృతి ఇచ్చే సవ్వడి చెట్లు ఇచ్చేగాలి
మనసు ఇచ్చే ఆనందం
పరవళ్ళు తొక్కే నీటి ప్రవాహం
గలగల పారే జలపాతాల
మృదంగ ధ్వనులు
నయనానందకరమైన చెట్లు
మృదువుగా వీచే
పిల్లగాలుల సుమధుర స్వరాలు
ప్రకృతికి రక్షణగా నిలిచిన పర్వతాలు
ప్రకృతి అందమైన స్వర్గం
ఊహకందని..
అందాలు ఊపిరి
ఊహలై విహరిస్తున్న
కాలంలో మనసు కోరే
మరో లోకం.. చూడాలనిపిస్తుంది
ప్రకృతి ఒడిలో.. సేద తీరిన మనసు
ఆహ్లాద ఆకాశంలో
పక్షిలా ఎగిరింది
ఎదన హాయిని నింపింది
అందమైన ప్రకృతి.. అద్భుతమైన
ఆలోచనల ఆకృతి.

– నేదునూరి కనకయ్య

# చేసే ముందు ఆలోచించాలి

ఒక రోజు ఓ రాజు తన మంత్రితో కలిసి అడవికి వెళ్ళాడు. అక్కడ ఒక సాధువు ఉన్నారు. ఆయన ఎదుట నిల్చున్నాడు. రాజు మంత్రితో కలిసి "స్వామీ, మీ ఆశీస్సులు కోసం వచ్చాను. నాకు ఏదైనా సలహా ఇవ్వండి" అన్నాడు రాజు. సాధువు అలాగే అని ఆశీర్వదించి "కుమారా, నువ్వు ఏ కార్యం చేసినా చేయడానికి ముందు ఆ కార్యం చేయడం వల్ల ఎదురయ్యే పరిణామాల గురించి ఆలోచించు. నీ మనసుకి నచ్చిందే చెయ్యి" అన్నాడు సాధువు.

సాధువు చెప్పింది బుర్రకెక్కించుకున్నాడు రాజు. సాధువుకు పాదాభివందనం చేశాడు. సాధువు పాదాల దగ్గర వంద బంగారు నాణాలను ఉంచి వెనుతిరిగాడు. ఇదంతా ఆయన వెంట ఉన్న మంత్రి నిశితంగా గమనించాడు.

"మన రాజు మరీ ఇంత అయోమయంగా ఉన్నాడు. సాధువు చెప్పింది ఏమన్నా గొప్ప సలహానా?" అనుకున్నాడు. దానికి రాజు వంద బంగారు నాణాలను సాధువుకు ఇవ్వాలా అని కూడా లోలోన అనుకున్నాడు. అయితే రాజు తన మంత్రి ఏమనుకుంటున్నాడో అతని ముఖం చూసి గ్రహించాడు.



రాజు, మంత్రి కోటకు చేరుకున్నారు. అనంతరం రాజు సాధువు చెప్పిన మాటలను గుర్తు చేసుకున్నాడు. ఒక రాతి మీద ఆ మాటలను చెక్కించాడు. కోటలో అందరికీ తెలిసేలా ఒక చోట ఏర్పాటు చేశాడు.

ఈ చర్య కూడా మంత్రిని ఆశ్చర్యపరిచింది. "మన రాజు తెలివితక్కువతనాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు అనుకున్నాడు" మంత్రి.

రోజులు గడిచాయి. ఓ రోజు ఆ రాజు భరించలేని కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. వెంటనే ఆస్థాన వైద్యుడిని పిలిపించాడు. క్షణాల్లో వచ్చాడు వైద్యుడు. రాజుని పరీక్షించాడు. కాసేపు మీరు ఇలానే పడుకోండి, నేను ఇంటికి వెళ్ళి ఓ మందు తయారు చేసి పట్టుకొస్తాను" అని ఇంటికి వెళ్ళాడు వైద్యుడు. తయారు చేసిన మందుతో వచ్చాడు వైద్యుడు. వైద్యుడు వచ్చే చూసేసరికి రాజు కళ్ళు మూసుకుని మంచం మీద పడుకున్నాడు. ఒక చిన్న పాత్రలో తాను తెచ్చిన మందుని పోశాడు వైద్యుడు. రాజుని తీక్షణంగా చూశాడు. వైద్యుడు అందులో ఓ చెంచాడు పొడి కలిపాడు. రాజుని సమీపించి కాసేపే ఏదో ఆలోచించాడు. పాత్రలో ఉన్న మందుని కింద పోసేశాడు. ఆ పాత్రను బాగా కడిగాడు. మళ్ళీ అందులో కొంత మందు పోశాడు.

రాజా! అని మెల్లగా పిలిచాడు. రాజు లేచాడు.

"ఏమిటి వైద్య శిఖామణీ, నేను కళ్ళు మూసుకుని ఉన్నా మధ్య మధ్య కళ్ళు తెరిచి అంతా గమనిస్తూనే ఉన్నాను. మొదటిసారి ఏదో కలిపారు. తర్వాత దానిని కింద కుమ్మరించారు. ఆ తర్వాత మళ్ళీ పాత్రలో ఏదో పోశారు. నిజం చెప్పండి" అని అడిగాడు రాజు.

"రాజా, మీ సైన్యాధిపతి మిమ్మల్ని చంపడానికి కుట్ర పన్నాడు. మీకివ్వదలచిన మందులో విషం కలపమన్నాడు, అలా చేస్తే భారీ మొత్తంలో కానుకలు ఇస్తానన్నాడు. నేనూ సరే అని చెప్పి మొదట విషం కలిపాను. అయితే ఇక్కడికి వచ్చే ముందర మీ కోట ఆవరణలో ఒక రాతి మీద ఉన్న మాటలు నన్ను ఆలోచనలో పడేశాయి. ఏ పని చేసినా దాని వల్ల కలిగే పరిణామాలను ఆలోచించు. అది మనసుకి కరెక్ట్ అనిపిస్తే చెయ్యమన్న మాటలలోని నిజాన్ని గ్రహించాను. దాంతో నేను మీకు మొదటిసారి మందులో కలిపిన విషాన్ని కింద కుమ్మరించేశాను. రెండోసారి మీకు ఇవ్వాలనుకున్న మందు స్వచ్ఛమైనది. అది మీకు పని చేస్తుందని, అందుకే మిమ్మల్ని దగ్గరకొచ్చి నిద్రలేపాను" అన్నాడు వైద్యుడు.

ఇదంతా విన్న రాజు మంత్రిని పిలిపించాడు. కాస్సేపటికి మంత్రి వచ్చాడు. "చూసావా మంత్రీ, ఆ రోజు నేను పెట్టిన ఫలకాన్ని చూసి మీరు ఏమనుకున్నారో మీ ముఖం చూసి గ్రహించాను, కానీ ఈ రోజు నా ప్రాణాలు కాపాడింది ఆ రాతి మీద చెక్కిన మాటలే" అన్నాడు రాజు. అందుకే పెద్దవాళ్ళు మనకు చెప్పే మాట సామాన్యమైనదిగా భావించకూడదు. నిర్లక్ష్యం చేయకూడదు.

...............

ఈ కాలానికి వస్తాను. ఒక యువకుడు ఓ సాధువు వద్దకు వెళ్ళాడు. ఆయనకు వెయ్యి రూపాయలు ఇచ్చి వెనుతిరిగాడు. "దేనికీ అలా చేశావని?" అడిగాను. "నేనీ రోజు ఈ స్థాయిలో ఉండటానికి కారణం ఆయనే. ఇప్పటికే ఆయన వద్దకు వెళ్ళి నాకు నాలుగు మంచి మాటలు చెప్పమని అడిగాను. కానీ ఆయన ఏమీ చెప్పలేదు" అన్నాడు ఆ యువకుడు. "ఒకవేళ అతను ఆ రోజు ఏదో ఒకటి చెప్పి నేను దానిని పాటించి ఉంటే నేనీ రోజు ఇలా ఉండేవాడిని కాను. అందుకే నేనీ రోజు ఆయనకు కృతజ్ఞతాపూర్వకంగా ఓ వెయ్యి రూపాయలు ఇచ్చి వచ్చాను" అని వెళ్ళిపోయాడు.

– యామిజాల జగదీశ్

# ప్లేట్లో పడేది పోషణా? లేక ప్రమాదమా?

ఇప్పటి కాలంలో ఆహారం అంటే కేవలం ఆకలి తీర్చుకోవడం మాత్రమే కాదు, అది ఆరోగ్యాన్ని నిలబెట్టే ప్రధాన ఆధారం. కానీ అదే ఆహారం కల్తీ కారణంగా ఆరోగ్యానికి ముప్పుగా మారుతోంది. ఒకప్పుడు 'పాలు పవిత్రం' అని నమ్మిన మన సమాజంలో, ఇప్పుడు పాలలో కల్తీ ఉందేమో! అన్న అనుమానం సహజమైపోయింది. పాలు, నెయ్యి, మసాలాలు, నూనెలు ఏ పదార్థం చూసినా నమ్మకం కంటే సందేహమే ఎక్కువగా కనిపిస్తోంది.

భారతదేశంలో ఆహార నాణ్యతను పర్యవేక్షించే బాధ్యత ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాదే. ఈ సంస్థ కఠిన ప్రమాణాలు అమలు చేస్తున్నప్పటికీ, చిన్న స్థాయి తయారీదారులు, అనధికార విక్రేతలు, విస్తృత సరఫరా వ్యవస్థ కారణంగా కల్తీ సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు. చట్టాలు ఉన్నా వాటి అమలు సమర్థంగా జరగకపోతే ప్రయోజనం ఉండదు. కల్తీకి ప్రధాన కారణం అధిక లాభాల ఆశ. ఖర్చు తగ్గించి లాభం పెంచుకోవాలని చూసే కొందరు వ్యాపారులు పాలలో నీరు, రసాయనాలు కలపడం, నెయ్యిలో ఇతర నూనెలు కలపడం, మసాలాల్లో రంగులు, నకిలీ పదార్థాలు కలపడం వంటి ప్రమాదకర చర్యలకు దిగుతున్నారు. ఈ కల్తీ ఆహారం తినడం వల్ల తక్షణమే ప్రభావం కనిపించకపోయినా, దీర్ఘకాలంలో కాలేయం, మూత్రపిండాలు, జీర్ణవ్యవస్థపై తీవ్ర దుష్ప్రభావాలు చూపుతుంది.

నేటి పరిస్థితుల్లో కల్తీని అరికట్టడానికి బహుముఖ చర్యలు అవసరం. ప్రభుత్వ స్థాయిలో తనిఖీలు మరింత కఠినంగా, తరచుగా జరగాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై భారీ జరిమానాలు, లైసెన్స్ రద్దు, అవసరమైతే జైలుశిక్షలు విధించాలి. అలాగే గ్రామీణ ప్రాంతాల వరకు ఆహార పరీక్షా ప్రయోగశాలలను విస్తరించడం అత్యవసరం.

సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు పెద్ద ఆయుధంగా మారింది. మొబైల్ ఫుడ్ టెస్టింగ్ వాన్లు, క్యూఆర్ కోడ్‌లు, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలు ఉపయోగించి ఆహార పదార్థాల మూలం, తయారీ, సరఫరా వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్లతోనే ఉత్పత్తి విశ్వసనీయతను తనిఖీ చేసే స్థాయికి వ్యవస్థలు అభివృద్ధి చెందుతున్నాయి.

ఇక వినియోగదారుల పాత్ర మరింత కీలకం. తక్కువ ధర చూసి వెంటనే కొనడం కంటే, ఉత్పత్తి నాణ్యతను పరిశీలించడం ముఖ్యం. ప్యాకేజింగ్‌పై ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్



నంబర్, గడువు తేదీ, తయారీదారుడి వివరాలు తప్పనిసరిగా చూడాలి. ఇంట్లోనే సాధ్యమైన చిన్న పరీక్షల ద్వారా కొన్ని కల్తీ పదార్థాలను గుర్తించవచ్చు. సోషల్ మీడియా ద్వారా అనుమానాస్పద ఉత్పత్తులపై సమాచారం పంచుకోవడం కూడా చైతన్యాన్ని పెంచుతుంది. సహకార వ్యవస్థలు కూడా విశ్వసనీయతకు చిహ్నంగా నిలుస్తున్నాయి. ఉదా: అమూల్ వంటి సంస్థలు రైతుల నుంచి నేరుగా వినియోగదారు లకు సరఫరా చేస్తూ పారదర్శకతను పాటిస్తున్నాయి. ఇలాంటి నమూనాలను ఇతర ఆహార రంగాల్లో కూడా విస్తరించడం అవసరం.

విద్యా వ్యవస్థలో ఆహార భద్రతపై పాఠాలు చేర్చడం కూడా సమయోచితం. చిన్నప్పటి నుంచే పిల్లలకు నాణ్యమైన ఆహారం, ఆరోగ్య పరిరక్షణ గురించి అవగాహన కలిగితే, భవిష్యత్తులో బాధ్యతగల వినియోగదారులు తయారవుతారు. మీడియా పాత్రను కూడా విస్మరించలేం. కల్తీ ఘటనలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజల్లో అవగాహన కల్పించడం, బాధ్యులపై ఒత్తిడి తీసుకురావడం వంటి అంశాల్లో మీడియా సమర్థవంతంగా పనిచేయాలి.

చివరగా చెప్పాలంటే కల్తీని పూర్తిగా నిర్మూలించడం కష్టమే కావచ్చు, కానీ దాన్ని గణనీయంగా తగ్గించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి, వ్యాపారులు నైతిక విలువలు పాటించాలి, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి.

ఈ మూడు కలిసి పనిచేస్తేనే మన ప్లేట్లో పడేది నిజంగా పోషణగా మారుతుంది. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే మాటను మనం మరింత జాగ్రత్తగా ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉంది.

– తిప్పర్తి శ్రీనివాస్

# అపూర్వ కానుక

**స్త్రీ శక్తికి, దయకు, త్యాగానికి ప్రతిరూపం. అందుకే ఆమెకు 'మాతృదేవోభవ' అని అగ్రతాంబూలం ఇచ్చి పూజిస్తాం. 19వ శతాబ్దంలో బొంబాయి (ప్రస్తుత ముంబై)లో 'కాటన్ కింగ్'గా పేరొందిన దిగ్గజ పత్తి వర్తకుడు ప్రేమ్‌చంద్ రాయ్‌చంద్ తన తల్లి రాజాబాయి కోసం దాదాపు ఐదున్నర లక్షల రూపాయల వ్యయంతో దక్షిణ ముంబైలోని ఫోర్ట్ ప్రాంతంలో రాజాబాయి గడియార గోపురం (క్లాక్ టవర్) నిర్మించాడు.**

1869లో ప్రారంభమైన ఈ క్లాక్ టవర్ నిర్మాణం 1878లో పూర్తయ్యింది. ఇందులో బ్రిటన్ నుండి తెప్పించిన రకరకాల గంటలు, వాద్య పరికరాల ధ్వనులను ఏర్పాటు చేశారు. బొంబాయి నగరంలోని దర్శనీయ ప్రదేశాలలో అత్యంత ఆకర్షణీయమైన ఈ క్లాక్ టవర్‌ను వీక్షించడానికి దేశ విదేశాల నుండి సందర్శకులు విచ్చేసేవారు.

1857 సిపాయిల తిరుగుబాటు తరువాత, బ్రిటిష్‌వారు పట్టణ ప్రాంతాలలో తమ అధికారాన్ని స్థాపించాలని సంకల్పించారు. ఆధిపత్యం, బ్రిటిష్‌తనానికి దృశ్యమాన చిహ్నాలుగా నిలిచేలా భారీ గడియార గోపురాలను (క్లాక్ టవర్స్)ను రూపొందించారు. ఇవి బ్రిటిష్ వలస పాలకుల పాలనకు మైలురాళ్ళుగా నిలిచాయి. బ్రిటిష్ అధికారులు నగదు, వాణిజ్యంపై నియంత్రణను ఏకీకృతం చేయడానికి భారతదేశం అంతటా ఒక ప్రామాణికమైన 'రైల్వే సమయాన్ని' సృష్టించాలని భావించారు. బ్రిటిష్ వలస పాలనకు ముందు స్థానిక సౌర సమయం ప్రకారం పనిచేస్తున్న నగరంలో ఈ గడియారపు గోపురాలు ఒక పారిశ్రామిక, పట్టణ వేగాన్ని బలవంతంగా ప్రవేశపెట్టాయి. విక్టోరియన్ శకం సాంస్కృతిక ఆధిపత్యాన్ని, వాస్తుశిల్ప సౌందర్యాన్ని ప్రతిబింబించేలా, రాజాబాయి టవర్‌ను నిర్మించారు.

రాజాబాయి టవర్ నిర్మాణ సమయంలో బ్రిటిష్ పాలకులకు నిధుల కొరత ఏర్పడడంతో టవర్ నిర్మాణం అర్థాంతరంగా నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడు 19వ శతాబ్దంలో బొంబాయికి చెందిన కాటన్ కింగ్, భారతీయ స్టాక్ బ్రోకర్, పరోపకారి, 'బిగ్ బుల్'గా ప్రసిద్ధి చెందిన ప్రేమ్‌చంద్ రాయ్‌చంద్, ప్రధానంగా అంధురాలైన తన తల్లి రాజాబాయిపై ఉన్న ప్రగాఢమైన ప్రేమతో టవర్ నిర్మాణానికి నిధులు సమకూర్చేందుకు తన అంగీకారం తెలిపారు. అయితే, విరాళాలు అందించేందుకు ఆ క్లాక్ టవర్‌కు తన



తల్లి 'రాజాబాయి' పేరు పెట్టాలని షరతు విధించగా అందుకు బ్రిటిష్ అధికారులు కూడా సమ్మతించారు. జైన మత ఆచార వ్యవహారాలను, కట్టుబాట్లను త్రికరణశుద్ధిగా ఆచరించే రాయ్‌చంద్ తల్లి రాజాబాయి చీకటి పడకముందే భోజనం చేసేవారు. రాత్రి భోజనానికి ఉపక్రమించే ముందు ఆమె ప్రతి రోజు సాయంత్రం సూర్యాస్తమయం అయ్యిందా అని ఇంట్లో వారిని అడిగేది.

ఒకరోజు సాయంత్రం ఆమె తన కోడలిని "సూర్యాస్తమయం అయ్యిందా?" అని రెండు సార్లు అడిగినప్పటికీ ఆమె ఏదో పని ధ్యాసలో ఉండి వెంటనే సమాధానం ఇవ్వలేదు. ఈ విషయాన్ని గమనించిన రాయ్‌చంద్, తన తల్లి సూర్యాస్తమయ సమయం కోసం ఎవరిపైనా ఆధారపడకుండా ఉండేందుకు ఏదైనా ఏర్పాటు చేయాలని దృఢంగా నిశ్చయించుకున్నారు. సరిగ్గా అదే సమయంలో నిధుల కొరత కారణంగా బ్రిటిష్ పాలకులు క్లాక్ టవర్ నిర్మాణానికి విరాళాలు అందించే దాతల కోసం అన్వేషించడం ఆయనకు కలిసి వచ్చింది.

## వాగ్దానానికి కట్టుబడిన ప్రేమ్‌చంద్ రాయ్‌చంద్

1860-1865 మధ్య అమెరికాలో అంతర్యుద్ధం కారణంగా బొంబాయిలో పత్తి వాణిజ్యం భారీ పరిమాణంలో ఊపందుకుంది. యుద్ధం కారణంగా అమెరికాకు పత్తి సరఫరాలు నిలిచిపోవడంతో, బ్రిటన్ దృష్టి భారతదేశం వైపు మళ్ళడంతో పత్తి ఎగుమతులు రెట్టింపై బొంబాయి ఒక ప్రపంచ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఇది రాయ్‌చంద్‌ను భారతదేశంలోని అత్యంత సంపన్నులలో ఒకరిగా నిలబెట్టింది. అయితే, 1865లో సంభవించిన

ఒక పెద్ద ఆర్థిక సంక్షోభంతో అత్యధిక సంపద కోల్పోయినప్పటికీ, రాయచంద్ మాత్రం టవర్ కోసం తాను వాగ్దానం చేసిన విరాళాన్ని ఉపసంహరించుకోలేదు. ఇది పరోపకార నిబద్ధత పట్ల ఆయన చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తుంది.



విద్యా రంగానికి మద్దతు అందించే విధంగా ఈ టవర్‌ను బొంబాయి విశ్వవిద్యాలయ గ్రంథాలయానికి అనుసంధానించేలా రూపొందించగా దీనికి కూడా రాయచంద్ పాక్షికంగా నిధులు సమకూర్చడం విశేషం.

1860వ దశకంలో నాటి బొంబాయి నగరంలో పత్తి వాణిజ్య కార్యకలాపాలు తారాస్థాయికి చేరిన సందర్భంలో 'కాటన్ కింగ్'గా, బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ వ్యవస్థాపకుడిగా, సంపన్న బ్రోకర్‌గా ఎదిగిన రాయ్‌చంద్ బొంబాయిలో మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల అభివృద్ధి లక్ష్యంగా పరోపకార కార్యక్రమాలలో విస్తృతంగా పాలుపంచుకోవడం ఆయన దాతృత్వానికి అద్దం పడుతుంది.

### అపూర్వమైన బహుమానం

ఆ విధంగా బ్రిటిష్ పాలకులకు 19వ శతాబ్దపు బొంబాయి కాటన్ కింగ్, పరోపకారి రాయ్‌చంద్ దాదాపు ఐదున్నర లక్షల విరాళం అందించడంతో 'రాజాబాయి క్లాక్ టవర్' నిర్మాణం 1869లో రెండు లక్షల రూపాయలతో పునః ప్రారంభమై దాదాపు ఐదున్నర లక్షల రూపాయలతో 1878లో పూర్తయ్యింది. ఆ మొత్తం ఇప్పుడు దాదాపు వంద నుండి నూట యాభై కోట్ల వరకు ఉండవచ్చు అని తెలిస్తే మనకు ఆశ్చర్యం వేస్తుంది.

ప్రతి గంటకు ఈ క్లాక్ టవర్ నుండి గంట శబ్దం వినిపించడంతో రాయ్‌చంద్ తల్లికి సూర్యాస్తమయ సమయం సులభంగా తెలిసేది. ఈ ఏర్పాటుతో ఆమె ఎవరిపై ఆధారపడకుండా సూర్యాస్తమయానికి ముందే తన ప్రార్థనలు ముగించుకుని రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించేది. ఈ వెసులుబాటు తన తల్లికి అత్యంత అనుకూలంగా ఉండడం రాయ్‌చంద్‌కు ఎంతో ఊరటనిచ్చింది.

రాజాబాయి టవర్ లోపల ఆకర్షణీయంగా ఉండే రంగుల అద్దాల కిటికీలు సందర్శకుల చూపులను మరల్చనీయదు. టవర్ బయటి భాగంలో పశ్చిమ భారతదేశపు వివిధ జాతులు, దుస్తులను ప్రతిబింబించే రాతి శిల్పాలు ఉన్నాయి. టవర్ బేస్ చతురస్రాకారంలో ఉండి, పైకి వెళ్లేకొద్దీ ఎనిమిది కోణాల ఆకారంలోకి మారుతుంది.

లండన్‌లోని ప్రసిద్ధ 'బిగ్ బెన్' (Big Ben) తరహాలో దీనిని వెనిషియన్, గోతిక్ శైలుల అద్భుతమైన సమ్మేళనంతో స్థానిక కుర్లా రాళ్లతో సుమారు 85 మీటర్ల (280 అడుగులు) ఎత్తులో నిర్మించిన ఈ టవర్‌ను లండన్‌కు చెందిన సుప్రసిద్ధ వాస్తుశిల్పి సర్ జార్జ్ గిల్బర్ట్ స్కాట్ డిజైన్ చేసినప్పటికీ ఆయన ఎప్పుడూ ఈ అద్భుత కళాఖండాన్ని దర్శించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

రాజబాయి క్లాక్ టవర్ నేటికీ ముంబై వారసత్వంలో ఒక క్రియాశీల భాగంగా నిలిచి ఉండడం మాతృమూర్తులం దరికీ గౌరవప్రదమైన విషయం.

ఈ టవర్ సంక్లిష్టమైన యాంత్రిక వ్యవస్థను వి.ఎస్. టైమ్ సర్వీసెస్ అనే సంస్థ నిర్వహిస్తోంది. ఈ గడియారం ఆటోమేటిక్ లేదా విద్యుత్‌తో నడిచేది కాకపోవడంతో దీని గంటలు ప్రతి పదిహేను నిమిషాలకు మోగేలా చూసుకోవడానికి ఒక టెక్నీషియన్ ప్రతిరోజూ రెండు వందల ముప్పై ఆరు మెట్లు ఎక్కి దీనికి స్వయంగా 'కీ' ఇస్తారు. అయితే నిర్మాణ సమయంలో ఏర్పాటైన పధ్నాలుగు గంటలలో ప్రస్తుతం ఐదు మాత్రమే పనిచేస్తున్నాయి. రాజాబాయి క్లాక్ టవర్‌ను 2018లో యునెస్కో (UNESCO) ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించారు.

రాజాబాయి క్లాక్ టవర్ కేవలం ఒక అపురూప కళాఖండమే కాదు, ఇది ఒక కొడుకుకు తన తల్లి పట్ల గల అవ్యాజమైన ప్రేమకు చిహ్నంగా ఆచంద్రార్కం నిలిచి ఉంటుంది.

**- యేచన్ చంద్రశేఖర్**

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**







## అర్థంకాని ఆంగ్లం, భయపెట్టే గణితం

రాము, చందు ఇద్దరు మంచి మిత్రులు. ఇద్దరు ఒకే తరగతి చదువుతున్నారు. రాము ఎంత చదివినా ఆంగ్లం అర్థంకాక, అందులో ప్రతిసారీ తక్కువ మార్కులు వస్తున్నాయి. చందుకు గణితం అంటే భయం. లెక్కలు సరిగా చేయకపోవడం వల్ల ప్రతిసారి తక్కువ మార్కులు వస్తున్నాయి. పరీక్షలంటేనే వారు భయపడేవారు. పరీక్షల ఫలితాలలో వీరి మార్కులు చూసి మిగతా విద్యార్థులు ఎగతాళి చేసేవారు. రాము, చందు చాలా బాధపడ్డారు. వీరి పరిస్థితి గమనించిన హెడ్మాస్టర్ దగ్గరికి పిలిపించుకుని "మనకు ఏ విషయమైతే కష్టతరంగా ఉంటుందో, ఆ విషయం పైననే ఎక్కువ దృష్టి పెట్టాలి. సమయం కేటాయించి, సాధన చేయాలి. భయపడవద్దు" అని చెప్పి వారిలో ఆత్మ విశ్వాసం కలిగించారు. రాము, చందులకు తమ లోపం అర్థమైంది. ఇద్దరు కలిసి ఇంటి దగ్గర చదవడం మొదలెట్టారు. రాము చందుకు ఆంగ్లం నేర్పించాడు. చందు రాముకు లెక్కలు ఎలా చేయాలో నేర్పించాడు. ఇద్దరు శ్రద్ధతో ప్రతి రోజూ సాధన చేసారు. ఆరు నెలల తర్వాత మళ్ళీ పరీక్షలు వచ్చాయి. ఈసారి భయం లేకుండా రాము, చందు పరీక్షలు రాసారు. ఇద్దరు ప్రథమ శ్రేణిలో నిలిచారు. ఎగతాళి చేసిన తోటి విద్యార్థులు అభినందనలు చెప్పడం వారికి సంతోషాన్ని కలిగించింది. చందు, రాము తమలో భయాన్ని పోగొట్టిన హెడ్మాస్టర్‌కు ధన్యవాదాలు చెప్పారు.

– కాటపాక రక్షిత్, అనంతసాగర్

## గొప్ప

ప్రసాద్ చదివే బడికి కొత్తగా వచ్చిన పంతులమ్మ, ప్రసాద్ అందమైన చేతిరాతను చూసి చాలా మెచ్చుకున్నారు. అప్పుడు ప్రసాద్ చేతిలోని పెన్సిల్‌కు చాలా గర్వం కలిగింది.



పక్కనే వున్న రబ్బరుతో "నీ బతుకు ఎప్పుడూ చెరపటమే కానీ నా లాగా అందంగా రాయటం రాదు. రాసినవాడికి మంచి పేరు తేవటం రాదు. నీ బతుకు శుద్ధ దండగ. నీకంటే నేనే గొప్ప" అని తన గొప్పలు చెప్పుకుంది. రబ్బరు ఏం మాట్లాడకుండా మౌనంగా వుండిపోయింది.

ఒక రోజున పంతులుగారు ఒక పేరా ఇచ్చి, తప్పులు లేకుండా, అందంగా రాయమని పరీక్ష పెట్టారు. బాగా సాధన చేసినా శంకర్రావు తప్పులు రాస్తే, ప్రసాద్ దగ్గరున్న రబ్బరు తీసుకొని చెరుపుతూ తప్పులు లేకుండా అందంగా రాసాడు. ప్రసాద్ కూడా బాగా రాసాడు కానీ ప్రసాద్‌కి తెలియకుండానే కొన్ని తప్పులు పోయాయి. పంతులుగారు శంకర్రావుని ఎంతో మెచ్చుకుని, తప్పులు రాసిన ప్రసాద్‌ని బెత్తంతో రెండు దెబ్బలు వేసారు. ప్రసాద్ దగ్గరున్న పెన్సిలు మనసు చివుక్కుమన్నది. మారిన మనస్సుతో రబ్బరు దగ్గరకు వెళ్లి "నేను అందంగా రాసినా, తప్పులు రాయటం వల్ల ప్రసాద్‌కి దెబ్బలు తగిలాయి. శంకర్రావు తప్పులు రాసినా, నిన్ను వాడుకొని చెరపటం వల్ల పంతులుగారి మెప్పు పొందాడు. తప్పులు చేసి, తెలుసుకోనివాడి కన్నా, చేసిన తప్పులు తెలుసుకొని, చెరిపేసుకున్నవాడే గొప్ప. అలా చెరిపేసుకోవటానికి ఉపయోగపడే నీవే నా కంటే గొప్ప" అంది. "నువ్వు. నీ ఉనికి వుంటేనే నేను వుంటాను. నా ఉనికి ఉంటుంది. కాబట్టి నా కంటే నువ్వే గొప్ప" అంది మంచి మనస్సుతో రబ్బరు.

"నీది మంచి మనస్సు. నీది గొప్ప మనస్సు. గొప్ప మనసు వున్నవాళ్లే గొప్ప" అని పెన్సిల్, రబ్బరును అభిమానంగా దగ్గరకు తీసుకుంది.

– మా.శ్రీ.రాజు, పాల్వంచ







# తెలుగు బాలల మెగా

వార్త ఆదివారం



## బాలగేయం

### బాల మేధావి

పిల్లలం పిల్లలం
రేపటి ఆశలం
అమ్మ నాన్నల
ప్రేమ మొలకులం
కుల మతాలకు
కుటిలతనానికి
మోసానికి.. మూర్ఖత్వానికి
దూరం
శాస్త్రీయతకు.. చట్టానికి
సంస్కారానికి బంధువులం
బడి మెట్లే బాధ్యత మెట్లు
మంచి గుణం..
మంచితనం
మాకు ఆభరణాలు
దేశ భవిత..
ఆశ, శ్వాస మాకు
విజ్ఞానమే మా వెలుగు రేకలు
పిల్లలం పిల్లలం
వికసించిన పువ్వులం
అరవిరిసిన నవ్వులం నవ్వులం

– రాళ్లబండి సంగం నాయుడు

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**ఎస్.విష్ణు, కాకినాడ**

ప్రశ్న: 'పవనం' అంటే ఏమిటి?

**జవాబు:** భూమి ఉపరితలం మీద క్షితిజ సమాంతరంగా చలించే వాయువును 'పవనం' అంటారు. ఊర్ధ్వ, అధోవాయు చలనాన్ని 'వాయుప్రవాహం' అంటారు. గాలి వేగాన్ని తెలియజేసేది పవన వేగమాపకం. గాలి వీచే దిశను తెలుసుకునేందుకు 'పవనసూచిక'ను ఉపయోగిస్తారు. పవనాలు ప్రపంచ పవనాలు, రుతుపవనాలు, స్థానిక వపనాలు అని మూడు రకాలు.

స్థిరంగా ఒకే దిశలో అధిక పీడన ప్రాంతాల నుంచి అల్పపీడన ప్రాంతాలకు వీచేవి 'ప్రపంచ పవనాలు'. ఇవి వ్యాపార, పశ్చిమ, ధృవ పవనాలని మూడు రకాలు. ఒక నిర్ణీత కాలంలో వీచే పవనాలను 'రుతుపవనాలని' అంటారు. కొన్ని ప్రాంతాలకు పరిమితమైనవి 'స్థానిక పవనాలు'.

**సి.మంజరి, హైదరాబాద్**

**ప్రశ్న: వర్షాలలో ఏమైనా తేడాలుంటాయా?**

**జవాబు:** పర్వతీయ వర్షపాతం, సంవహన వర్షపాతం, చక్రవాత వర్షపాతం అని వర్షపాతం మూడు రకాలుగా ఉంటుంది. నీటి ఆవిరి పర్వత శ్రేణులను ఢీకొన్నప్పుడు, అది ద్రవీభవించి వర్షం కురిస్తే దానిని 'పర్వతీయ వర్షపాతం' అంటారు. సూర్యకిరణాలతో భూమి వేడెక్కి, దగ్గరలోని గాలి వేడెక్కి తేలికై పైకి లేవడం వల్ల సంవహన వాయు ప్రవాహాలు ఏర్పడతాయి. ఆ గాలిలోని తేమ వర్షించినప్పుడు దానిని 'సంవహన వర్షపాతం' అంటారు. ఉదా: మన దేశంలో వేసవిలో వచ్చే వర్షం, సుడిగాలులతో వచ్చే వర్షాన్ని చక్రవాత వర్షపాతం' అని అంటారు.





# భక్తవత్సలుని మరో వాసం

**కలియుగ వైకుంఠ నివాసుడు శ్రీనివాసుడు. కలియుగ వరదుడు.. భక్తసులభుడు.. ఆర్తులను ఆదుకొనే గోవిందుడు. సమస్త భూమండల పరిరక్షకుడు అయిన శ్రీహరి శ్రీ వెంకటేశ్వరునిగా ఇలలో అనేక ప్రదేశాలలో కొలువు తీరి భక్తులకు అభయం ప్రసాదిస్తున్నారు.. అన్న విషయం మనందరికీ తెలిసిందే!**

ఎందరో భక్తులకు కలిగిన దివ్య అనుభూతుల గురించి ఎన్నో గాథలు ప్రచారంలో ఉన్నాయి. ఆయా వివరాల ఆధారంగా మనం చూస్తే ఆ ప్రదేశాలు గతంలో గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందినట్లుగా తెలుస్తుంది. అలాంటి విశేష క్షేత్రాలు మన తెలుగు రాష్ట్రాలలో ఎన్నో కనపడతాయి. ప్రతి క్షేత్రం తనవైన విశేషాలతో భక్తులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం గత వైభవానికి దూరంగా ఉన్నప్పటికీ విశేషాలను మాత్రం నేటికీ ప్రదర్శిస్తున్నాయి. అలాంటి వాటిలో కలియుగ వైకుంఠం తిరుమలకు సమీపంలోని 'తొండమాన్ పురం'.



### తొండమాన్ చక్రవర్తి

వేంకటాచల చరిత్రలో, అన్నమయ్య కీర్తనలలో, పౌరాణిక విశేషాలలో పేర్కొన్న తొండమాన్ చక్రవర్తి తిరుమలలో నేడు మనందరం శ్రీవారిని దర్శించుకొంటున్న 'ఆనంద నిలయం' నిర్మాణం చేసినది. శీనివాసునికి స్వయంగా మామగారైన ఆకాశ రాజుకు సోదరుడు. ఈయన నాడు పాలించిన నేటి తమిళనాడులోని ఉత్తర, ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ భాగాన ఉన్న ప్రాంతాలను 'తొండై మండలం' అని పిలిచేవారు. ఆరణి, కోశస్థలయార్, పాలార్, చెయ్యార్, వేగావతి నదుల సంగమాల మధ్య, పులికాట్ సరస్సుకు ఒక వైపున నెలకొని ఉన్న సారవంతమైన భూభాగమే తొండై మండలం.

శ్రీ వేంకటేశ్వరుని పట్ల అచంచల భక్తి కలిగినవాడు తొండమాన్ చక్రవర్తి. భక్తి శ్రద్ధలతో శ్రీవారికి తొలి ఆలయం అయిన ఆనంద నిలయం నిర్మించినది ఈయనే!

నేటి శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలో ఉన్న 'తొండమాన్ పురం' తొమ్మిదవ శతాబ్ద కాలంలో ఈయన రాజధాని, 'కోట' అని పిలిచేవారట. నిత్యం ఉదయాన్నే ఏడుకొండల స్వామిని దర్శించుకోకుండా ఏ పనీ చేసేవారు కాదట చక్రవర్తి. ఇందుకోసం తన రాజమహల్ నుండి తిరుమలకు ఒక సొరంగ మార్గం నిర్మింప చేసుకొన్నారట. ప్రతిరోజు స్వామిని సేవించుకొని వచ్చిన తరువాత మాత్రమే రాజ విధులను నిర్వర్తించేవారట.

కాలక్రమంలో వయస్సు రావడంతో వృద్ధాప్య సమస్యలతో తిరుమలకు వెళ్లలేని పరిస్థితి వచ్చింది తొండమానునికి ఆరాధ్య దైవాన్ని సందర్శించుకోలేని బాధాకర పరిస్థితిని తట్టుకోలేక తగిన తరుణోపాయం చూపమని దేవదేవుని ప్రార్థించారట.

భక్తసులభుడైన శ్రీ వేంకటేశ్వరుడు ఒకనాటి రాత్రి రాజుకు స్వప్న దర్శనమిచ్చారట. "నేను నా దేవేరులతో కలిసి ఈ రాజభవనం లోనే నీ సేవలు అందుకోడానికి వస్తున్నాము" అని సెలవిచ్చారట.

ఆ మాటలు విని ఆనందంతో నిద్ర లేచిన రాజుకు రాజప్రాసాద మధ్యలో శ్రీవారు దేవేరులతో కొలువు తీరి దర్శనమిచ్చారట.

ఈ కారణంగా రాజుగారి ఇంటిలో కొలువైన స్వామిని "వీటిలో ఇరందురై పెరుమాళ్" (ఇంటిలో కొలువైన స్వామి) అని పిలుస్తారు.

తన అదృష్టానికి అమిత సంతోషించిన తొండమానుడు ఒక సుందర ఆనంద నిలయాన్ని పోలిన ఆలయాన్ని నిర్మించారట.

స్వామి నిత్య పూజల నిమిత్తం ఆలయానికి సమీపంలో నిర్మించిన పుష్కరిణిలోనికి తిరుమలలోని ఆకాశ గంగ నీరు ప్రవహించే ఏర్పాటు కూడా ఉన్నదని చెబుతారు.

తొండమానుని కాలం నుండి ఇప్పటికీ ఆ కోనేటి నీటితోనే స్వామివారి సేవలు జరుపుతారు.

కోట, రాజమహల్ కాలగర్భంలో కలిసిపోయాయి. వివిధ రాజ వంశాల పాలనలో ఆలయం అభివృద్ధి చెందినట్లుగా తెలియవస్తోంది. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్నదీ ఆలయం.

## ఆలయ విశేషాలు

తూర్పు ముఖంగా ఉన్న ఈ చిన్న ఆలయం తిరుమల ఆనంద నిలయాన్ని పోలి ఉంటుంది. నూతనంగా నిర్మించిన మూడు అంతస్థుల రాజగోపురం శోభాయమానంగా కనిపిస్తుంది. ధ్వజస్థంభం, ముఖమండపం, శ్రీ గరుత్మంతుని సన్నిధి ప్రాంగణం లోనికి అడుగు పెట్టగానే దర్శనమిస్తాయి.

విశాల సుందర ప్రాంగణం. పూల మొక్కలు దేవతా వృక్షాలు పచ్చని ప్రశాంత ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తుంటుంది. గర్భాలయానికి ఇరుపక్కలా ద్వారపాలకులు, జయవిజయులు కాపలాగా నిలిచి ఉంటారు.

ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవలసినది శ్రీవారి రూపం గురించి. దేశంలో ఏ ప్రాంతంలో నెలకొని లేదా నెలకొల్పబడ్డ శ్రీ వెంకటేశ్వర స్వామి రూపం స్థానక (నిలుచున్న) భంగిమలో, చతుర్భుజాలలో శంఖు, చక్రాలు, వరద/అభయ, కటి హస్తాలతో దర్శనమిస్తారు. శ్రీ బాలాజీని మరో రూపంలో ఊహించుకోవడం కూడా సాధ్యం కాదు.

కానీ తొండమాన్ పురంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి రూపం కొంత భిన్నంగా ప్రత్యేకంగా ఉంటుంది. మరెక్కడా ఇలాంటి రూపంలో శ్రీ శ్రీనివాసుని దర్శించుకోలేం. గాయక భక్తులైన పన్నిద్దరు ఆళ్వార్లు పాడిన పాశురాల మూలంగా మనకు లభించిన నూట ఎనిమిది శ్రీ వైష్ణవ దివ్యదేశాలలో కొన్ని చోట్ల పరంధాముడు ఉపస్థిత



భంగిమలో కొలువైన ఉంటారు. కానీ తొండమాన్ పురంలో గోవిందుని రూపం పూర్తిగా ప్రత్యేకంగా ఉండటం చెప్పుకోవలసిన అంశం.

ఉపస్థితి (కూర్చున్న) భంగిమలో శంఖు చక్రాలు ధరించి రెండు చేతులతో అభయం ఇస్తూ ఇరువైపులా అమ్మవార్లతో అత్యంత రమణీయ అలంకరణలో నేత్రపర్వంగా దర్శనం అనుగ్రహిస్తారు.

ప్రాంగణంలో ఉపాలయాలు ఉండవు. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయంలో నిత్యం నిర్ణయించిన విధానంలో పూజలు జరుగుతాయి. అన్ని హిందూ పర్వదినాలలో, వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఉత్సవాలను, శ్రీరామనవమి ఆస్థానం, శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రీ హనుమజ్జయంతి, వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు.

భక్తసులభుడైన భగవంతుడు నిరంతరం నిజ భక్తులను సమయానుకూలంగా అనుగ్రహిస్తారన్న దానికి సరైన ఉదాహరణ శ్రీ భూదేవి శ్రీదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయం.

ఉదయం ఆరు గంటల నుండి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు; తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు భక్తుల కోసం ఈ ఆలయం తెరిచి ఉంటుంది.

సర్వాంతర్యామి స్వయంగా కొలువుదీరిన ఈ విశేష క్షేత్రం తిరుపతికి ముప్పై ఐదు; శ్రీకాళహస్తికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో నెలకొని ఉయింది. తిరుమల సందర్శించేవారు తప్పకుండా దర్శించే శైవ క్షేత్రం శ్రీకాళహస్తి. ఇక్కడ జాతకరీత్యా సమస్యలు ఎదుర్కొంటున్నవారు చేసుకొనే రాహు-కేతు పూజలకు ఎంతో ఆదరణ ఉన్నది. అలాంటి క్షేత్రానికి సమీపంలో ఉన్న ప్రత్యేక క్షేత్రం శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారు కొలువుదీరింది తొండమాన్‌పురం. మన పురాతన ఆలయాల సందర్శన ఆ క్షేత్రాల అభివృద్ధికి మరింత దోహదపడుతుంది.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**


## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

కథ

# మూడో కోణం

తాళ్ళూరి చంద్రశేఖర్

భరద్వాజతో నా స్నేహం ఈ రోజుదీ, నిన్నటిదీ కాదు. దాదాపు యాభై ఏళ్లకు పై బడినది. వీధిబడి మొదలుకుని డిగ్రీ దాకా ఇద్దరం కలిసే చదువుకున్నాము. నేను ప్రతి ఏడు అత్తెసరు మార్కులతో చదువులో గట్టెక్కుతుంటే భరద్వాజ మాత్రం ప్రతి సంవత్సరం మొదట స్కూల్లోనూ, తరువాత కాలేజీలోనూ మొదటి ర్యాంక్ కొట్టేస్తూ ఉత్తమ విద్యార్థిగా పురస్కారాలు అందుకునేవాడు.

నేను డిగ్రీతో చదువుకు స్వస్తి చెప్పి కాంట్రాక్టర్‌గా సెటిల్ అయితే వాడు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి సర్విస్ కమీషన్ పరీక్షలు పాసై ప్రభుత్వోద్యోగిగా స్థిరపడ్డాడు.

చిన్నప్పటి నుంచి అందరం కలిసి చదువుకున్నా మా మిత్ర బృందంలో భరద్వాజ అంటే స్నేహంతో పాటు కొంచం అసూయ, మరికొంచం కోపం ఉండేవి. అందుకు ప్రధాన కారణం మా తల్లిదండ్రులు మమ్మల్ని ప్రతి విషయానికీ భరద్వాజతో పోల్చి కించపరచడం.

వాడి సుగుణాలు, మంచి ప్రవర్తన మా పాలిట శాపం అయిపోయాయి. దాంతో మేము ప్రతి దానికి వాడిని విమర్శిస్తూ ముద్ద పప్పనీ, బండ రాయనీ, గంగిరెద్దనీ ఏవేవో పేర్లు పెట్టి ఎగతాళి చేసేవాళ్ళం.

అయితే భరద్వాజ మాత్రం ఇవేవీ పట్టించుకునేవాడు కాదు. తన మానాన తనుంటూ బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకునేవాడు. ఎవరేమన్నా పట్టించుకునేవాడు కాదు. క్రమశిక్షణకి మారుపేరులా ఉండేవాడు.

ఆ క్రమశిక్షణ తత్వం, కఠిన ప్రవర్తనే ఉద్యోగస్తుడు, ఓ ఇంటివాడు అయ్యాక భరద్వాజని ఇంటా బయటా కూడా ఎన్నో క్లిష్ట పరిస్థితులలో పడేయడమేగాక, చండశాసనుడు, కర్కోటకుడులాంటి అనేక బిరుదులను కూడా ఆపాదించింది.

వాడి భార్య శాంత చాలా సాత్వికురాలు. భర్త మాట ఆమెకు వేదవాక్కు. భర్తకు తలలో నాలుకలాగా మెసులుకుంటూ సంసారాన్ని ఏ ఒడుదుడుకులు లేకుండా సజావుగా నడిపేది. వాళ్ళకి ఇద్దరు కవల పిల్లలు. అబ్బాయి సాకేత్, అమ్మాయి యామిని. భరద్వాజ ఇంటి సమస్యలు మొదలైంది పిల్లలు హైస్కూల్ చేరుకున్న సమయంలో. అంతవరకు తండ్రి ఏ మాట చెప్పినా వేదవాక్కులా వినే పిల్లలు కొంచం పెద్దవాళ్ళయేసరికి మిగతా పిల్లలతో తమను పోల్చుకోవడం మొదలెట్టారు. దాంతో తండ్రిని అది కావాలని, ఇది కావాలని వేధించసాగారు.

భరద్వాజ ఏది చేసినా ఒక పద్ధతి ప్రకారం చేసేవాడు. ఇంట్లోనైనా, స్కూల్లోనైనా పిల్లలు ఇంటి భోజనమే చేయాలి. ఏ పుట్టిన రోజుకో పున్నమికో మాత్రమే బయట హోటళ్ళకి తీసుకువెళ్ళేవాడు అదీ పిల్లలు ఎంతో వేధిస్తే.

అలాగే బట్టలు కూడా లెక్క పెట్టి మరీ కొనేవాడు. అదీ తనకు నచ్చినవి మాత్రమే. పిల్లల చదువుకునే సమయాలు, నిద్రపోయే సమయాలు, భోజనం చేసే సమయాలు అన్నీ తనే నిర్ణయించేవాడు. అలాగని వాళ్ళకి ఏదీ తక్కువ చేసేవాడు కాదు. వాళ్ళని చిన్ననాటి నించీ క్రమ శిక్షణతో పెంచితే వాళ్ళు జీవితంలో పైకి వస్తారని అతని భావన.

టీనేజ్‌లో ఉన్న అతని పిల్లలకు ఇదంతా రుచించేది కాదు. దాంతో ప్రతి రోజు ఆ ఇంట్లో పెద్ద సంగ్రామమే జరిగేది. పాపం శాంత అటు భర్తకు చెప్పలేక, ఇటు పిల్లలకు సర్ది చెప్పలేక నలిగిపోయేది.



నేనెప్పుడైనా వాళ్ళింటికి వెళితే "అన్నయ్యగారూ! మీరైనా ఆయనకు కొంచం నచ్చచెప్పండి" అని బ్రతిమిలాడేది.

భరద్వాజకు నేనెప్పుడయినా నచ్చచెప్పబోతే వాడు "నీకు తెలియదురా భాస్కరం! ఈ వయసులో వాళ్ళకి ఏది మంచో ఏది చెడో చెప్పవలసిన బాధ్యత మన తల్లిదండ్రులది. బయటి ఆకర్షణలకి తేలిగ్గా లొంగిపోయే వయసు వాళ్ళది. వాళ్ళకి బాధ్యతలు నేర్పి సక్రమ మార్గంలో పెంచడం మన కర్తవ్యం" అనేవాడు.

చెప్పడమే కాదు, వాడు అలాగే మసలుకునేవాడు కూడా. పిల్లలు పెద్దయ్యాక వారికి ఎంత ఇష్టం లేదన్నా వినకుండా పట్టు వదలని విక్రమార్కుడిలాగా వాళ్లని బతిమాలో, బామాలో మొత్తానికి నచ్చచెప్పి అబ్బాయిని ఎంబిబిఎస్ లోనూ, అమ్మాయిని బిటెక్‌లోనూ చేర్పించాడు, అవి చేస్తే మీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందంటూ. వాళ్ళింటికి నేనెప్పుడెళ్లినా పిల్లలిద్దరూ మొత్తుకునేవారు తండ్రి తమ కిష్టంలేని చదువు చదివిస్తున్నాడని, తమ స్నేహితులందరు హాయిగా ఇష్టమైన చదువులు చదువుకుంటూ ఆనందిస్తుంటే తమకేమో ఇరవై నాలుగు గంటలు చదువు తప్ప మరే సరదాకి సమయం లేకపోతోందని.

తండ్రి నిరంకుశపు ధోరణిని అదేపనిగా ఆడిపోసుకునేవారు. వాళ్ళ అమ్మ ఎప్పుడైనా వాళ్ళ నాన్నని వెనకేసుకొస్తే ఆవిడని కూడా తప్పుపట్టేవారు.. నీ వల్లే నాన్న ఇలాగ తయ్యారయ్యాడని.

ఇంటి పరిస్థితి ఆ విధంగా ఉంటే ఆఫీసులో పరిస్థితి మరో విధంగా ఉండేది. అతని క్రింద పని చేసే ఉద్యోగులందరూ బిక్కు బిక్కు మంటూ పనిచేసేవారు ఎప్పుడు అతని ఆగ్రహానికి గురి కావలసి వస్తుందోనని.

భరద్వాజ ఆఫీసుకు ఎప్పుడూ పావుగంట ముందే వచ్చేవాడు. అలాగే తన కింద పని చేసేవారు కూడా ఆఫీసుకు సమయానికి ముందే రావాలని కోరుకునేవాడు. అందరూ ఆఫీసు నిర్దేశించిన సమయాలు కచ్చితంగా పాటించాలని ఆదేశించేవాడు.

ప్రభుత్వం మనకు జీత భత్యాలు ఇస్తున్నది నిర్దేశించిన పని వేళల్లో మనం సంపూర్ణంగా ప్రభుత్వ పనులు చేయడానికి. అంతేగానీ మొక్కుబడిగా పని చేయడానికి కాదు అనేవాడు. సక్రమంగా పని చేసేవారిని ఎంత బాగా చూసుకునేవాడో, ఎంత చెప్పినా సరిగా పనిచేయని వారిని అంతే కఠినంగా శిక్షించేవాడు.

అంతేకాదు.. ప్రతి ఉద్యోగి ఏరోజు పని ఆ రోజు ముగించేయాల్సిందే ఎంత లేటయినా. అలాగే ప్రజలు పెట్టుకునే అర్జీలు ఎప్పటికప్పుడు ఏమాత్రం జాప్యం లేకుండా చూసి అనుమతులు మంజూరు చేయాలి. ప్రభుత్వమంటే ప్రజల కోసం పనిచేసే యంత్రాంగం. అటువంటి ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి అసౌకర్యం కలిగించకూడదు అనేవాడు.

**భరద్వాజ ఆఫీసుకు ఎప్పుడూ పావుగంట ముందే వచ్చేవాడు. అలాగే తన కింద పని చేసేవారు కూడా ఆఫీసుకు సమయానికి ముందే రావాలని కోరుకునేవాడు. అందరూ ఆఫీసు నిర్దేశించిన సమయాలు కచ్చితంగా పాటించాలని ఆదేశించేవాడు.**

దాంతో ఆఫీసులో అతనంటే ఒక విధమైన బెరుకు మొదలయ్యేది. ఎప్పుడెప్పుడు అతనికి ట్రాన్స్‌ఫర్ అయి వేరే డిపార్ట్‌మెంట్‌కి వెళ్లిపోతాడా? అని ఎదురు చూసేవారు.

అలాగే నియమ నిబంధనలతో కచ్చితంగా, ముక్కుకు సూటిగా పనిచేసే అతని వైఖరి కొందరు పై అధికారులకు, అప్పణంగా లాభాలు కొట్టేయాలని చూసే కొందరు కాంట్రాక్టర్లకు నచ్చేది కాదు.

ఫలితంగా భరద్వాజ తరుచు బదిలీలకు లోను కావాల్సి వచ్చేది. అయినా కూడా భరద్వాజ తన నైతిక సూత్రాలను, నియమాలను, ఉద్యోగ నియమావళిని ఎన్నడూ మార్చుకోలేదు.

చూస్తుండగానే భరద్వాజ షష్టిపూర్తి చేసుకుని పదవీ విరమణ చేసే సమయం ఆసన్నమయింది. పదవీ విరమణ రోజు ఆఫీసులో వాడికి వీడ్కోలు పార్టీ ఏర్పాటు చేశారు.

దానికి తన కుటుంబ సభ్యులతో పాటు నన్ను కూడా తీసుకుని వెళ్ళాడు భరద్వాజ. నేను బితుకు బితుకుమంటూ వెళ్ళాను సభలో వాడి గురించి ఎలాంటి అవాక్కులు, చవాక్కులు వినాల్సి వస్తుందోనని. వీడ్కోలు సభ ఆఫీసు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. స్టేజి మీద ఐదారు కుర్చీలు, క్రింద ఆహ్వానితులకు ఒక వంద దాకా కుర్చీలు వేశారు. నేననుకున్నది వాడికి వీడ్కోలు చెప్పడానికి ఒక పదిమంది వస్తే గొప్పని. అయితే నా అంచనా తారుమారు చేస్తూ దాదాపు అన్ని కుర్చీలు నిండి పోయాయి. వాడు ప్రస్తుతం పని చేసే ఆఫీసులో వారే కాక ఇంతకు ముందు పని చేసిన డిపార్ట్‌మెంట్లలోని ఉద్యోగస్తులు కూడా చాలా మంది వచ్చారు.

సభలో ముందుగా వీడ్కోలు కమిటీ మెంబర్లు ముగ్గురు భరద్వాజను, అతని పనిని శ్లాఘిస్తూ మాట్లాడారు. తరువాత భరద్వాజ పై అధికార్లు ఇద్దరు అతని వ్యక్తిత్వాన్ని, అతను ప్రభుత్వానికి చేసిన సేవలను గురించి మాట్లాడారు. అందరూ ఏదో మొక్కుబడిగా మాట్లాడినట్టు ఉంది తప్ప ఎవరూ మనఃస్ఫూర్తిగా మాట్లాడినట్టు లేదు. ముందుగా అనుకున్నదే కనుక వారి మాటలు నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు.

పోనీలే ఎవరూ చెడుగా మాట్లాడలేదు కదా! అని సంతృప్తి పడ్డాను. కమిటీ సభ్యులు, పై అధికారులు భరద్వాజను పుష్పమాలాంకృతుడిని చేసి, మెమెంటో బహూకరించాక సభానిర్వాహకుడు భరద్వాజను సత్కారానికి తన స్పందనను తెలపాల్సిందిగా కోరుతూ– దానికి ముందు మరెవరైనా మాట్లాడదలచుకున్నారా? అని అడిగాడు.

అతని మాటలకు వెనక వరసలో కూర్చున్న ఒక పెద్దాయన లేచి నిలబడి చెయ్యెత్తాడు.

నిర్వాహకుడు అతన్ని స్టేజ్ మీదకొచ్చి మాట్లాడమని కోరగా పైకి వచ్చి మైకు అందుకుని మాట్లాడడం మొదలు పెట్టాడు.

"నా పేరు నారాయణ. నేను భరద్వాజ సారు దగ్గర వరంగల్లులో పని చేశాను. పని చేసే రోజుల్లో సారు అంత స్ట్రిక్టుగా ఉండడం నాకు

నచ్చేది కాదు. ఎప్పుడు ఎదురు తిరిగి మాట్లాడేవాడిని. ఎన్నో సార్లు మెమోలు అందుకున్నాను కూడా. అయినా నా వైఖరి మార్చుకోలేదు. సారు మంచితనం గురించి ఎప్పుడు తెలిసిందంటే నేను రిటైర్ అయ్యాక నా పింఛను మంజూరు కాని సమయంలో.

నా సర్వీస్ రికార్డులో కొన్ని రెడ్ మార్కులున్నాయని హెడ్ ఆఫీసు వాళ్ళు నాకు పింఛను మంజూరు చేయలేదు. నేను ఎన్ని సార్లు హెడ్డాఫీసు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఏడాది పాటు ఎటువంటి ఆర్జన లేక నేను, నా కుటుంబం ఎన్నో కష్టాలు పడ్డాము. అటువంటి సమయంలో అనుకోకుండా నన్ను కలుసుకున్న భరద్వాజ సారు నా కష్టాలు తెలుసుకుని స్వయంగా పై ఆఫీసర్లు అందరితో మాట్లాడి నా పింఛను మంజూరు అయ్యేటట్లు చేయించ గలిగారు.

సర్వీసులో ఉన్నప్పుడు నేను చేసిన తప్పులన్నీ తెలిసి ఉన్నా అవసరానికి ఆదుకున్న భరద్వాజ సారుకి నేను, నా కుటుంబం ఆ జన్మాంతం ఋణపడి ఉంటాము".

అతని ప్రసంగం అయిపోగానే మరొక మధ్య వయస్కురాలు స్టేజి ఎక్కి మాట్లాడడం మొదలెట్టింది "నా పేరు సుచిత్ర. సారు ఖమ్మంలో పని చేస్తున్నప్పుడు నా భర్త సారు క్రింద పనిచేసేవాడు. ఒక ఆక్సిడెంట్‌లో నా భర్త అకస్మాత్తుగా మరణిస్తే భరద్వాజ సారు అస్తవ్యస్తమైన నా కుటుంబ పరిస్థితి చూసి స్వయంగా పూనుకుని నాకు అదే ఆఫీసులో ఉద్యోగం వచ్చేటట్టు చేశారు. ఇప్పుడు నేను, నా పిల్లలు ఏ ఆర్థిక ఇబ్బంది లేకుండా జీవించగలుగుతున్నామంటే ఆ పుణ్యమంతా సారుదే".

ఆమె మాట్లాడడం అయిపోగానే మరొక మహిళ స్టేజ్ మీది కెళ్ళి "నా పేరు సరస్వతి. భరద్వాజగారు కర్నూలులో పని చేస్తున్నప్పుడు నేను ఆయన ఆఫీసులోనే పని చేసేదాన్ని. ఒకసారి నా భర్తకు పెద్ద జబ్బు చేసి అర్జంటుగా సర్జరి చేయాల్సి వస్తే ఆ విషయం తెలుసుకున్న భరద్వాజగారు హాస్పిటల్‌కి వచ్చి డాక్టర్లతో మాట్లాడి దగ్గరుండి సర్జరి చేయించారు. అంతేకాదు, ఆ సమయంలో మమ్మల్ని ఆర్థికంగా కూడా ఎంతో ఆదుకున్నారు. పైగా ఆ సహాయం విషయం ఎవరికీ చెప్పొద్దని మా దగ్గర మాట తీసుకున్నారు. అటువంటి ఉన్నత మనిషికి ఏమిచ్చినా మా ఋణం తీరదు" అంటూ కళ్ళనీళ్లు పెట్టుకుంది.

ఆ తరువాత వెల్లువలా ఒకరి తరువాత మరొకరు ఎందరో వక్తలు స్టేజ్ మీద కొచ్చి భరద్వాజ తమకు చేసిన గుప్త సహాయాల గురించి చెప్పసాగారు. ఆ ప్రసంగాలు వింటున్న నాకు మతిపోసాగింది.

చివరగా నన్ను ఎంతో అబ్బుర పరుస్తూ సాకేత్ మైక్ అందుకుని మాట్లాడడం మొదలు పెట్టాడు. "పెద్దలందరికి నా నమస్కారాలు. నా పేరు సాకేత్. నేను ఈ రోజు పదవీ విరమణ చేస్తున్న భరద్వాజ గారి కుమారుడిని. ఇప్పటివరకు నాన్నగారి గొప్పతనం, మంచితనం గురించి మీరు పదే పదే మననం చేసుకోవడం నాకు ఆనందం కలిగించడమే కాదు ఎంతో ఆశ్చర్యపరిచింది కూడా. నాన్నగారిలో ఇంతవరకు మాకు తెలియని మరో గొప్ప మనిషి ఉన్నాడని ఆ మనిషి మీ అందరి హృదయాలలో గూడు కట్టుకుని ఉన్నాడని తెలిసి నేను ఎంతో గర్వపడుతున్నాను. ఇంత మంచి విషయాలు తెలిపినందుకు మీ అందరికీ నా ధన్యవాదాలు. నేను ఒక కుమారుడిగా ఆయన గురించి చెప్పవలసి వస్తే నా కౌమార దశ అంతా ఆయనను, ఆయన నిరంకుశ ఆదేశాలను తిట్టుకోవడంతోనే సరిపోయింది. చిన్ననాటి నుండి ఆయన మాకు అలవరచిన క్రమశిక్షణ, చూపిన మార్గదర్శకత్వం, తప్పు దారి పట్టకుండా తీసుకున్న చర్యలు అప్పుడు అర్థమవ్వకపోయినా ఈ రోజు నేను, నా చెల్లెలు సమాజంలో ఒక ఉన్నత స్థానానికి చేరుకున్నాక, మాకూ సంసార బాధ్యతలు మీద పడ్డాక తెలిసి వస్తున్నాయి.

అందుకు ఏమిచ్చినా మా అమ్మగారి, నాన్నగార్ల ఋణం తీర్చుకోలేము. ఇంతటి ఉన్నత విలువలు ఉన్న నాన్నగారి కొడుకుగా పుట్టడం నా పూర్వజన్మ సుకృతం అనుకుంటున్నాను" అని ముగించాడు. ఆ తరువాత భరద్వాజ ఇచ్చిన స్పందన ప్రసంగంతో వీడ్కోలు సభ విజయవంతంగా ముగిసింది.

నేనైతే ఇంకా విభ్రాంతి నుంచి తేరుకోలేదు. ఇంతవరకు నేను భరద్వాజలోని రెండు కోణాలను మాత్రమే చూశాను. మొదటి కోణం చిన్ననాటి నుండీ ఎంతో బుద్ధిమంతుడుగా సత్ప్రవర్తనకు మారు పేరుగా ఉంటూ బాగా చదువుకుని జీవితంలో పైకి వచ్చిన భరద్వాజ. రెండో కోణం క్రమశిక్షణ, నియమావళి, సక్రమ బాధ్యతా నిర్వహణ అంటూ ఇంటా బయటా కూడా నిరంకుశుడుగా పేరు తెచ్చుకున్న భరద్వాజ.

ఇప్పుడు నేను చూస్తున్నది భరద్వాజలోని మూడో కోణాన్ని, గొప్ప మానవత్వంతో ఇతరులకు ఎల్లప్పుడూ సహాయం చేస్తూ ఆ సహాయం కూడా అత్యంత గోప్యంగా ఉంచుతూ ఒక సామాన్యమైన వ్యక్తిగా జీవితం కొనసాగించిన భరద్వాజ.

ఇప్పటికైనా భరద్వాజలోని ఆ 'మహా' మనిషిని కుటుంబ సభ్యులే కాకుండా అతని సహోద్యోగులు కూడా గుర్తించినందుకు ఎంతో ఆనందిస్తూ, అభినందనలు తెలపడానికి భరద్వాజ వైపుకు నడిచాను.

**ఇప్పుడు నేను చూస్తున్నది భరద్వాజలోని మూడో కోణాన్ని, గొప్ప మానవత్వంతో ఇతరులకు ఎల్లప్పుడూ సహాయం చేస్తూ ఆ సహాయం కూడా అత్యంత గోప్యంగా ఉంచుతూ ఒక సామాన్యమైన వ్యక్తిగా జీవితం కొనసాగించిన భరద్వాజ.**

# పుస్తకం ఓ నిశ్శబ్ద విజ్ఞాన విస్ఫోటనం..

ఇప్పటి డిజిటల్ యుగంలో చదవడం అనే కళ క్రమంగా కళావిహీనం అయిపోతున్నది. చదవడానికి ఏకాగ్రత, తపన కావాలి. చదవడాన్ని అమితంగా ఇష్టపడితే ఏకాగ్రత దానంతట అదే వస్తుంది. స్మార్ట్ ఫోన్ వచ్చాక సామాజిక మాధ్యమాల్లోంచి బయట పడడం అసాధ్యంగా తోస్తున్నది. ప్రతి నెల లేదా సంవత్సరంలో ఇన్ని పుస్తకాలు చదవాలనే నియమం పెట్టుకోవాలి. పుస్తకాలు కొనడం అలవాటు చేసుకోవాలి. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు ఆసక్తి వున్న ఇతర అంశాలకు సంబంధించిన పుస్తకాలను కూడా చదవడం అలవాటు చేసుకోవాలి. చదువును నమ్మినవారు ఎన్నటికీ చెడిపోదని, మనం నేర్చుకున్న ప్రతి విషయం మనకు జీవితంలో ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యావేత్తలు మాత్రమే సమాజంలో గుర్తింపు, గౌరవాలను పొందుతారని తెలుసుకోవాలి. 'పుస్తకం ఓ నిశ్శబ్ద విజ్ఞాన విస్ఫోటనం' అని గుర్తించినవారు జీవితంలో ఎత్తుపల్లాలను సునాయాసంగా అధిగమిస్తారు.

**ప్రముఖుల జీవిత చరిత్రలు చక్కని మార్గాన్ని చూపుతాయి:** "నేను పుస్తకాలు కొన్న తర్వాత డబ్బు మిగిలితేనే తినుబండారాలు కొంటాను" అనే సూత్రం పాటిస్తూ పుస్తకాలు కొనడానికి, వ్యక్తిగత లైబ్రరీ నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. చదివితే తెలివి పెరుగుతుంది, మెదడు చురుకుగా పనిచేస్తుంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మేధావుల జీవిత చరిత్రలు మనకు చక్కని మార్గనిర్దేశనం చేస్తూ, ప్రేరణగా నిలుస్తాయి. పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన జరిగి సరైన ఉద్యోగం, సమాజంలో గుర్తింపు దొరుకుతాయి. ఉద్యోగంతో జీవితంలో స్థిరత్వం పెరుగుతుంది. పౌర సమాజంలో గౌరవం లభిస్తుంది. పుస్తకాలు కొనడం, చదవడానికి సమయం ఇవ్వడం మంచి ప్రతిఫలాలను, జీవన సాఫల్య ఫలితాలను ఇస్తుందని తెలుసుకోవాలి. పుస్తకాలు కొని చదవకపోతే మనం వెచ్చించిన ధనం వృథా అవుతుంది.



ఇంట్లో పుస్తకాలు ఉంటే రోజు ఒకటి లేదా రెండు గంటలైనా చదవడం మంచిదని గమనించాలి. ప్రతి ఏటా వంద వరకు పుస్తకాలు చదివే విధంగా మన జీవనశైలి ఉండాలి. వారాంత సెలవుల్లో చదవడానికి కొంత ఎక్కువ సమయాన్ని కేటాయించాలి.

## పుస్తక పఠనం జీవనశైలిలో భాగం కావాలి

మీ జీవనశైలిని బట్టి చదవడానికి సమయం కేటాయించాలి. మీరు ఎక్కువగా ప్రయాణాలు చేసేవారయితే ప్రయాణ సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించవచ్చు. బిడ్డకు పాలు పట్టే తల్లి కూడా పుస్తకాలను చదవవచ్చు.

మనం తినేటప్పుడు, కార్యాలయాల్లో, పని ప్రదేశంలో, చివరికి వాష్ రూమ్‌లో కూడా ఆసక్తిగల వారు చదవవచ్చు. వారానికి సగటున పది గంటలు చదివే అలవాటు ఉన్నవారు ఏడాదికి దాదాపు వంద పుస్తకాలు చదవవచ్చు. స్మార్ట్ ఫోన్ లేదా ల్యాప్ టాప్ తెరలపై సమయాన్ని వృథా చేయడం కన్నా పుస్తక పఠనానికి అధిక సమయం ఇవ్వడం సముచితంగా ఉంటుంది.

## కౌమార దశలోనే పుస్తక పఠనం అలవాటు..

అందరు అన్ని రకాల పుస్తకాలను చదువలేరు. మనకు ఆసక్తి ఉన్న రంగాలకు సంబంధించిన పుస్తకాలను చదవడం మనకు ఇష్టంగా ఉంటుంది. ప్రముఖుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, సమకాలీన సమస్యల గురించి చర్చించే పుస్తకాలు, మనం ఎంచుకున్న రంగానికి లేదా వృత్తికి సంబంధించినవి, ప్రముఖ నవలలు, పేరెన్నికగన్న రచనలు లాంటివి ఏవైనా చదవవచ్చు. కౌమార దశ నుంచే చదవడాన్ని ముఖ్య అలవాటుగా చేసుకోవాలి. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలను చదవడం ఒక మంచి అలవాటు. పుస్తకాలు చదివేటప్పుడు ముఖ్యమైన విషయాలను నోట్ చేసుకోవడం మరువరాదు. పాక్షికంగా చదివిన పుస్తకం పేజీని పేపర్ ముక్క పెట్టి లేదా పేజీ మూల మలిచి గుర్తుంచుకోండి. మనకు నచ్చిన కొటేషన్లను నోట్ చేసుకోవాలి.

చదవడానికి నియమ నిబంధనలు, సరైన సమయ సందర్భాలు అనేవి ఏవీ ఉండవు. పాఠకుడికి ఆసక్తి ఉంటే ఎడారిలో లేదా ఎండల్లో కూడా చదవవచ్చు. చదవడం వల్ల మనో విస్తృతి పెరుగుతుంది. సమాజం లోతులు అర్థం అవుతాయి. ఆత్మ విశ్వాసం అపారంగా పెరుగుతుంది. ప్రజాదరణ పెరుగుతుంది. పేరు ప్రఖ్యాతులు సాధిస్తారు. చదివి అర్థం చేసుకున్న విషయాలను ఆచరణలో పెడితే మీ వ్యక్తిత్వం మరింత ఇనుమడిస్తుంది. పుస్తకం హస్తభూషణమే కాదు మస్తిష్క వికాస సాధనం కూడా అని గుర్తుంచుకోవాలి. చదువును దుకాణంలో కొనడానికి వీలు కాకపోవచ్చు, కానీ పుస్తకాన్ని చదివి జ్ఞానాన్ని ఆర్జించవచ్చని మరిచిపోరాదు.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

# పురాతన బౌద్ధ క్షేత్రాలు

తెలంగాణాలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పలుమార్లు జరిగిన తవ్వకాలలో అనేక బౌద్ధ క్షేత్రాలు వెలుగు చూశాయి. ఫణిగిరి, ధూళికట్ట, నేలకొండపల్లి, నాగార్జునకొండ పరిసర ప్రాంతాలతో పాటు అక్కడ నిర్మించిన బౌద్ధవనం, కోటిలింగాల వంటి ప్రాచీన బౌద్ధ క్షేత్రాలు చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉన్నాయి. శాతవాహన, ఇక్ష్వాకు రాజుల కాలం నాటి స్థూపాలు, విహారాలు ఇక్కడ తవ్వకాల్లో బయట పడ్డాయి. ఫణిగిరిలో అత్యంత పురాతన శిల్పకళ, సామాజిక మార్పుకు ప్రధాన కేంద్రంగా నిలిచింది.

## ఫణిగిరి

సూర్యాపేట జిల్లాలోని ఫణిగిరిలో అత్యంత విశాలమైన, సురక్షితమైన బౌద్ధ విహారాల సముదాయం ఉంది. ఇక్కడ స్థూపాలు, సభామందిరాలు, శాతవాహన కాలం నాటి శిల్పాలు బయటపడ్డాయి. తెలంగాణాలోని అత్యంత ముఖ్యమైన అద్భుతమైన బౌద్ధ పురావస్తు క్షేత్రం. 'ఫణి' అంటే పాము అని, 'గిరి' అంటే కొండ అని అర్థం. ఈ కొండ పాము పడగ ఆకారంలో ఉండటం వల్ల దీనికి ఆ పేరు వచ్చింది. ఇది క్రీ.పూ.1వ శతాబ్దం నుండి క్రీ.శ.3వ శతాబ్దం వరకు (శాతవాహనులు, ఇక్ష్వాకుల కాలం) విరాజిల్లినట్లు ఆధారాలు ఉన్నాయి. ఇది ఒకప్పుడు బౌద్ధ సన్యాసుల నివాసంగా, విద్యా కేంద్రంగా, ఆరాధనా స్థలంగా ఉండేది. కొండపై భాగంలో ఇటుకలతో నిర్మించిన మహాస్థూపం ఉంది. ఇక్కడ బయటపడిన రాతి తోరణాలు అత్యంత అరుదైనవి. సాంచి స్థూపం వద్ద ఉన్నటువంటి తోరణాలను ఇక్కడ చూడవచ్చు.



1940వ దశకంలో ఇక్కడ జరిపిన తవ్వకాలలో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడ మహాస్థూపం, ఆరామాలు చైత్యాలు, శిల్పాలు. శిలాశాసనాలు లభించాయి. ఇక్కడ జరిపిన తవ్వకాల్లో బుద్ధుడి పాదముద్రలు (బుద్ధుని పాదాలు) ఇక్కడ లభించాయి. ఈ క్షేత్రంలో బౌద్ధ సన్యాసులు నివసించే ఆరామాలు, ప్రార్థనా మందిరాలు ఉన్నాయి. ఇక్కడ లభించిన శిల్పాలు, తోరణాలు అమరావతి కళాశైలిని పోలి ఉంటాయి. ప్రస్తుతం ఈ ప్రాంతం పర్యాటక శాఖ ఆధీనంలో ఉంది. కొండపైకి చేరుకోవడానికి మెట్లు ఉన్నాయి. కొండపైన ప్రశాంత వాతావరణం, చుట్టూ ఉన్న ప్రకృతి పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఫణిగిరిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇక్కడ పురావస్తు శాఖ మ్యూజియం కూడా ఉంది. ఫణిగిరి బౌద్ధ క్షేత్రం బౌద్ధమత ప్రచారానికి, అప్పటి సాంస్కృతిక, కళాత్మక ఉన్నతికి ఒక నిదర్శనంగా నిలుస్తుంది.

## ధూళికట్ట

తెలంగాణలోని అతి ప్రాచీన బౌద్ధ క్షేత్రాలలో అత్యంత కీలకమైనది ధూళికట్ట. కరీంనగర్ నుండి సుమారు 25 కి.మీ. దూరంలో హుస్సేనిమియా వాగు ఒడ్డున ఈ క్షేత్రం ఉంది. ఇది క్రీ.పూ.2వ శతాబ్దానికి (శాతవాహనుల కాలం) చెందినది. అంటే దాదాపు 2,200 యేళ్ల నాటి చరిత్ర దీనికి ఉంది. ధూళికట్ట అంటే మట్టితో నిర్మించిన కోట లేదా గోడ అని అర్థం. ఇక్కడ ఒక పురాతన మట్టి కోట అవశేషాలు ఉండటం వల్ల ఈ పేరు వచ్చింది. 1970లలో జరిగిన తవ్వకాల్లో ఇక్కడ అద్భుతమైన ఆనవాళ్లు దొరికాయి. ఇక్కడ లభించిన స్థూపం ఆంధ్ర ప్రాంతంలోని అమరావతి స్థూపం కంటే పురాతనమైనదని చరిత్రకారుల అభిప్రాయం. ఈ స్థూపం ఒక ఎత్తైన వేదికపై నిర్మించారు. దీని చుట్టూ 17 సున్నపురాతి పలకలను అమర్చారు. ధూళికట్టలో లభించిన అతి ముఖ్యమైన శిల్పం ఐదు తలల పాము పడగ నీడ బుద్ధుడికి పడుతున్నట్లుగా ఉన్న శిల్పం బౌద్ధ సాహిత్యం. ప్రకారం బుద్ధుడు ధ్యానంలో ఉండగా తుఫాను వస్తే ముచిలింద అనే నాగరాజు తన పడగతో బుద్ధుడిని రక్షించాడని చెబుతారు. దీన్ని బుద్ధుడిని కాపలా కాసే పాము అని కూడా పిలుస్తారు. స్థూపానికి సమీపంలోనే శాతవాహన రాజుల కాలం నాటి ఒక పటిష్టమైన మట్టి కోట, రాజప్రసాదం వంటి నిర్మాణాలు బయల్పడ్డాయి. బ్రాహ్మీ లిపి ఉన్న శాసనాలు, శాతవాహనుల నాటి నాణేలు, రోమన్ నాణేలు, పూసలు, గాజులు మొదలైన పురావస్తు సంపద ఇక్కడ లభించింది. ఈ ప్రాంతం ప్రస్తుతం పురావస్తు శాఖ ఆధీనంలో ఉంది. బౌద్ధ మతస్థులకు, చరిత్ర పరిశోధకులకు, పర్యాటకులకు ఇది ఒక ప్రధాన సందర్శనీయ స్థలం.

## నేలకొండపల్లి

ఇది ఖమ్మం జిల్లాలో ఉంది. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దదైన బౌద్ధ స్తూపం ఇక్కడ ఉంది. ఇది మట్టితో నిర్మించిన స్తూపం కావడం విశేషం. ఇక్కడ నిర్వహించిన

తవ్వకాల్లో అనేక బౌద్ధ విగ్రహాలు, నాణేలు, ఇతర చారిత్రక వస్తువులు లభించాయి. ఖమ్మం నగరం నుండి సుమారు ఇరవై కి.మీ. దూరంలో ఉన్న ఈ ప్రాంతం చారిత్రక, ఆధ్యాత్మిక పరంగా ఎంతో విశిష్టమైనది. నేలకొండపల్లిలో ఉన్న బౌద్ధ స్థూపం దేశంలోనే అతిపెద్ద మట్టి స్థూపాలలో ఒకటిగా పరిగణిస్తారు. సన్యాసులు నివసించడానికి వీలుగా ఉండే అనేక గదులు (విహారాలు), ప్రార్థనా మందిరాలు ఇక్కడ బయటపడ్డాయి. ప్రస్తుతం ఇక్కడ పర్యాటకుల కోసం మ్యూజియం, ఉద్యానవనం, వసతి సదుపాయాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. నేలకొండపల్లి కేవలం బౌద్ధ క్షేత్రమే కాకుండా, భక్త రామదాసు (కంచెర్ల గోపన్న) జన్మస్థలం కూడా.



## కోటిలింగాల

జగిత్యాల జిల్లాలో ఉన్న కోటలింగాల ఒక అత్యంత ప్రాచీనమైన, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రదేశం. ఇది కేవలం ఒక శాతవాహన రాజధాని మాత్రమే కాదు, ఒక ముఖ్యమైన బౌద్ధ క్షేత్రం కూడా. ఈ ప్రాంతం చుట్టూ ఇటుకలతో నిర్మించిన కోట గోడలు ఉన్నాయి. కోటిలింగాల గ్రామం గోదావరి నది తీరాన ఉంది. పురాతన కాలంలో నదీ తీరాలు వర్తకానికి, కోటిలింగాల ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయంగా ఉండేవి. గోదావరి, పెద్దవాగు కలిసే ఈ సంగమ ప్రాంతంలో ఈ బౌద్ధ క్షేత్రం వెలసింది. బౌద్ధ కేంద్రంతో పాటు ఇక్కడ ప్రసిద్ధ కోటిలింగేశ్వర స్వామి దేవాలయం కూడా ఉంది. ఇది శైవ, బౌద్ధ సంస్కృతుల కలయికకు ప్రతీకగా నిలుస్తుంది.

## కొండాపూర్

ఇది సంగారెడ్డి జిల్లాలో ఉంది. దీనిని 'దక్షిణ అయోధ్య' అని పిలిచినప్పటికీ, ఇక్కడ పెద్ద ఎత్తున బౌద్ధ చైత్యాలు, విహారాలు బయల్పడ్డాయి.

## కారుకొండ

ఇది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రామవరంలో ఉంది. ఇక్కడ బౌద్ధ విహారాలు ఉన్నాయి. అత్యంత విశిష్టమైన బౌద్ధ క్షేత్రాలలో ఒకటి. కొత్తగూడెం పట్టణానికి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక గుట్టపై ఈ పురాతన బౌద్ధ అవశేషాలు ఉన్నాయి. ఇది రెండు



ముఖ్యమైన బౌద్ధ స్మారక కట్టడాల నిలయం. ఇది ప్రాచీన బౌద్ధ సంస్కృతికి, తెలంగాణలో బౌద్ధ మత వ్యాప్తికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ గుట్టపై ఒక భారీ ఇసుకరాతి గుండు ఉంది. దీని ప్రత్యేకత ఏమిటంటే ఈ రాతికి నాలుగు దిశలలో నాలుగు గూళ్లు చెక్కబడి ఉన్నాయి. ప్రతి గూడులోనూ బుద్ధుడు పద్మాసనంలో ధ్యాన ముద్రలో కూర్చున్నట్లుగా అందమైన శిల్పాలు చెక్కారు.

## బౌద్ధ కేంద్రాలు

సికిందరాబాద్ మహేంద్ర హిల్స్‌లోని మహాబోధి బుద్ధ విహార, తథాగత బుద్ధ విహార(కార్ఖానా) ప్రసిద్ధ ఆధునిక బౌద్ధ కేంద్రాలు. విహారం లోపల బుద్ధుని భారీ విగ్రహం ఉంటుంది. గది గోడలపై బుద్ధుని జీవిత చరిత్రకు సంబంధించిన అద్భుతమైన పెయింటింగ్స్, శిల్పాలు ఉన్నాయి. ఇక్కడ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ధ్యాన తరగతులు జరుగుతాయి. ప్రశాంతత కోరుకునే వారికి ఇది ఒక గొప్ప ప్రదేశం. ప్రతి సంవత్సరం బుద్ధ పూర్ణిమ వేడుకలు ఇక్కడ చాలా వైభవంగా జరుగుతాయి. ఆ సమయంలో విహారాన్ని దీపాలతో అలంకరిస్తారు. మహాబోధి సంస్థ ఇక్కడ విద్యాసంస్థలను, ధార్మిక గ్రంథాలయాలను కూడా నిర్వహిస్తోంది. సికింద్రాబాద్‌లోని కార్ఖానా ప్రాంతంలో ఉన్న ఈ విహారం కూడా బౌద్ధ అనుయాయులకు, పర్యాటకులకు ముఖ్యమైన కేంద్రం.

## బుద్ధవనం (నాగార్జున సాగర్)

ఇది ఆధునిక కాలంలో నిర్మించిన ఒక భారీ బౌద్ధ వారసత్వ థీమ్ పార్క్ ఇది దాదాపు 274 ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధ సంస్కృతిని, బుద్ధుడి జీవిత ఘట్టాలను ఇక్కడ అద్భుతమైన శిల్పకళతో పునఃసృష్టి చేశారు. బుద్ధవనంలో బుద్ధుని జీవిత ఘట్టాలను వివరించే శిల్పాలు, బుద్ధుని పూర్వ జన్మ కథలను తెలిపే జాతక కథల శిల్పాలు, ధ్యానం చేసుకోవడానికి ప్రశాంతమైన వాతావరణం, వివిధ దేశాల్లోని (ఆగ్నేయాసియా) ప్రసిద్ధ బౌద్ధ స్థూపాల నమూనాలు ఇక్కడ చూడవచ్చు. ఇక్కడ ఉన్న బుద్ధుని పాదముద్రలు శ్రీలంక ప్రభుత్వం బహూకరించినవి. నాగార్జున కొండ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన బౌద్ధ క్షేత్రం. ప్రసిద్ధ బౌద్ధ పండితుడు ఆచార్య నాగార్జునుడు ఇక్కడ నివసించి, మాధ్యమిక వాదాన్ని ప్రబోధించారు. నాగార్జున సాగర్ డ్యామ్ నిర్మాణ సమయంలో మునిగిపోయిన ఈ ప్రాంతంలోని అవశేషాలను ఒక ద్వీపంపై (మ్యూజియంలో) భద్రపరిచారు. ఇక్కడ మహాస్థూపం, విహారాలు, ప్రాచీన బౌద్ధ విశ్వవిద్యాలయ ఆనవాళ్లు చూడవచ్చు.

– షేక్ అబ్దుల్ హకీం జాని

# ‘పరజల వేధ’ అంటే?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458

**బి.ప్రసాద్, కోహెడ**

**‘పరజల వేధ’ అని దేనిని అంటారు? వివరించగలరు.**

**జవాబు:** ఒక గృహంలోని, ఆ గృహావరణలోని నీటి ప్రవాహాలు వాస్తు నియమాలకు విరుద్ధంగా ఉన్నప్పుడు ఆ ఇంటికి ‘స్వజల వేధ’ అనే వాస్తుదోషం కలుగుతుంది. అలాగే పరుల ఇంటి నుండి వచ్చే నీటి ప్రవాహం తమ ఇంటిలోనికి గానీ, తమ ఇంటి ఆవరణలోనికి గానీ ఏ దిక్కు నుండి ప్రవహించినా తమ ఇంటికి ‘పరజల వేధ’ అనే వాస్తుదోషం కలుగుతుంది. ఇలాంటి దోషం వల్ల విషజంతువు, విషకీటక ప్రమాదాలు, శత్రు భయాలు, కలహాలు కలిగే అవకాశం ఏర్పడుతుంది.

తమ ఇంటిలోకి ప్రవహించే నీరు భూమి ఉపరితలం ద్వారా, లేదా భూమి అడుగులు పైపుల ద్వారా అయినా దుష్ఫలితాలు ఏర్పడతాయి. పరుల ఇంటి నుండి ప్రవహించిన నీరు తమ ఇంటిని కూడా దాటి బయటకి వెళ్లినట్లయితే ప్రవాహ దిక్కుననుసరించి ఫలితాల తీవ్రత హెచ్చుతగ్గులుగా ఉంటుంది. పరుల ఇంటి నుండి వచ్చే నీటి ప్రవాహం తమ గృహంలోకి వచ్చి ఆగిపోవటం వలన అతి తీవ్రమైన దుష్ఫలితాలు పొందవలసి ఉంటుంది. ఇతరుల చూరుపై నుండి కారిన వర్షపు నీరు తమ ఇంటి ఆవరణ లోపల పడినట్లయితే కూడా ‘పరజల వేధ’ దోషం కలుగుతుంది. అంటుదు మిద్దెలకు ఈ విధమైన దోషం ఉండదు. చాలా చోట్ల రెండు ఇండ్ల మధ్యన మురుగు నీరు ప్రవహించటానికి కొంత స్థలాన్ని(షేర్ సందులు) వదిలిపెడతారు. ఆ స్థలంలో నుండి మురుగునీరు పోవటానికి కాలువలు గానీ, పైప్‌లైన్లు గానీ (అండర్ గ్రౌండ్) ఏర్పాటు చేస్తారు. అత్యాశకొద్ది ఆ స్థలాలను కూడా ఇంటి ఆవరణలోకి కలిపేసుకొని ప్రహరీగోడలు కట్టి



కొందరు తమ భూభాగాన్ని పెంచుకుంటూ ఉంటారు. ఇలా చేయటం వలన వారు పెంచుకున్న భూభాగం అడుగు నుండి ఎందరో వదిలిన మురుగు నీరు ప్రవహిస్తూ ఉంటుంది. తద్వారా వారికి ‘పరజల వేధ’ అనే వాస్తుదోషం కలుగుతుంది. వాస్తుదోషం కలిగించే పెద్ద స్థలం కంటే వాస్తు దోషంలోని చిన్న స్థలం మనకు ఎంతో మేలు చేస్తుంది. మాటిమాటికి విపరీతమైన శత్రు భయం కలుగుతున్నా, భరింపరాని కలహాలు కలుగుతున్నా, విష కీటకాలు, విష జంతువులు ప్రమాదకరంగా పరిణమిస్తున్నా, ఆ ఇంటికి ‘పరజల వేధ’ దోషం ఉన్నదేమోనని సరిచేసుకోవటం మంచిది. అలాంటి దోషం ఉన్నప్పుడు సరిచేసుకోవడం వలన పైన సూచించిన ప్రమాదాల నుండి రక్షించుకోవచ్చు.

## పొలాలకు వాస్తు దోషాలుంటాయా?

**ఎల్.సుబ్రహ్మణ్యం, కల్వకుర్తి**

**ప్రశ్న: గృహాలకు వున్నట్లుగా భూములకు కూడా వాస్తు దోషాలుంటాయా? ఆ దోషాలను సరిచేసుకోవచ్చా? పొలాలకు వాస్తు దోషాలుంటే ఆ ప్రభావం ఎలా ఉంటుంది?**

**జవాబు:** గృహానికుండే వాస్తు నియమాలే అన్నిటికీ వర్తిస్తాయి. గృహ, వాపీ, కూప, తటాక, తోట, కోట మొదలైన ప్రతిదీ భూమిపైనే నిర్మించబడుతుంది. అలాంటి భూమిని ‘క్షేత్రం’ అంటారు.

నిర్మాణం లేని భూమి కూడా ఒక క్షేత్రమే అవుతుంది. సత్ఫలితాలనివ్వగలిగే భూమి ఏ విధంగా ఉండాలన్న విషయం వాస్తు శాస్త్రంలో స్పష్టంగా వివరించారు. అలాంటి నియమాలకు విరుద్ధంగా ఉండే భూమి వాస్తు దోషం కలిగి ఉంటుంది. దోషాలను బట్టి ఫలితాలుంటాయి. అది ‘ఇంటి భూమి’ అయినా ‘పంటభూమి’ అయినా మంచి-చెడు ఫలితాల్లో మార్పుండదు.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం ‘వాస్తువార్త’లో సమాధానాలిస్తారు.
ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : .............................................
పుట్టిన తేది : ...........................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................
చిరునామా:...............................................

మనిషి జీవితంలో అత్యంత విలువైన సంపద ధనం కాదు, బంధువులు కాదు, అదృష్టం కాదు.. ఆత్మ విశ్వాసం. ఈ విశ్వాసమే మనసుకు వెలుగుని నింపే దీపం. మనిషి తనమీద నమ్మకం కోల్పోతే అతడు అంధకారంలో తారసపడిన నీడవుతాడు. కానీ తనలోని శక్తిని, విలువను, సామర్థ్యాన్ని గుర్తించిన క్షణం నుంచే జీవితం కొత్త దిశలో మొదలవుతుంది. ఆత్మ విశ్వాసం మనసులో వెలిగే దీపం మాత్రమే కాదు, గుండె లోతుల్లోని శక్తిని సందేహించొచ్చు, కానీ మనలోని విశ్వాసం మన పాదాలు ఆగనీయదు. ప్రపంచం "నువ్వు చేయలేవు" అన్నా, మన హృదయం "చేయగలను" అని నమ్మినప్పుడు అదే నిజమైన విజయం.

ఆత్మ విశ్వాసం ఉన్న మనిషి భయాన్ని



# ఆత్మవిశ్వాసమే జీవన రహస్యం

మేల్కొలిపే అంతర బలం.

జీవితంలో ఎదురయ్యే ప్రతి అడ్డంకి ఒక పరీక్ష. దానిని ఎదుర్కొనే ధైర్యం ఉన్నవాడే ముందుకు సాగగలడు. ఆ ధైర్యానికి మూలం మనలోని నమ్మకం. మనం మనమీద నమ్మకం ఉంచినప్పుడు, ప్రపంచం మనకు మార్గం చూపుతుంది. చరిత్రలోని మహనీయులు పెద్ద అవకాశాలతో కాక, విశ్వాసంతోనే శిఖరాలకు చేరుకున్నారు "నేను చేయగలను" అనే ఒక్క భావం వారి జీవితానికి మార్గదర్శకమైంది.

అపజయం ఎప్పుడూ ముగింపు కాదు. అది కొత్త ప్రారంభానికి సంకేతం. ప్రతి ఓటమి వెనుక ఒక పాఠం దాగి ఉంటుంది. ఆ పాఠాన్ని గుర్తించే మనిషే విజేత. మనం తలుపు మూసుకున్న చోటే, కొత్త తలుపు తెరుచుకుంటుంది. ఆ తలుపు తాళం చెవి ఆత్మ విశ్వాసం. "నేను ఎందుకు కాదు?" అని ప్రశ్నించిన మనసు ఎప్పుడూ వెనకడుగు వేయదు.

బయటి పరిస్థితులు మన చేతిలో ఉండవు కానీ మన మనసు మన నియంత్రణలోనే ఉంటుంది. సమాజం విమర్శించొచ్చు, ఇతరులు జయిస్తాడు. విఫలతను ప్రేరణగా మార్చుకుంటాడు. జీవితం సముద్రంలా ఉంటుంది, అలలు తప్పవు. ఈత కొట్టగలవాడు అలలతో పోరాడతాడు, భయపడేవాడు తీరాన నిలుస్తాడు. అలల మధ్య ముందుకు సాగేది ఆత్మ విశ్వాసమే.

మన ఆలోచనలు మన భవిష్యత్తు. "నేను చేయలేను" అనుకునేవాడు దారిలో ఆగిపోతాడు. "నేను ప్రయత్నిస్తాను" అనుకునేవాడు నెమ్మదిగా గమ్యానికి చేరతాడు. ప్రతి ప్రయత్నం మనలోని బలాన్ని పెంచుతుంది. ఆ బలం మన ఆలోచనల నాణ్యతతో పెరుగుతుంది.

మనసు ఎప్పుడూ భయపెడుతుంది "ఏమవుతుందో?" అని. కానీ ఆ ప్రశ్నకు సమాధానం ఒకటే "ప్రయత్నించకపోతే ఎలా తెలుస్తుంది?" అదే విశ్వాసానికి మూలం. చిన్న ప్రయత్నాలు పెద్ద విజయాలకు పునాది వేస్తాయి. రైతు విత్తనం వేస్తాడు. మొలకెత్తుతుందో తెలియదు, కానీ విత్తుతాడు. అదే అతని విశ్వాసం.

ప్రపంచం తరచుగా మనల్ని పరీక్షిస్తుంది. సమాజం వ్యతిరేకించొచ్చు. కానీ మనలోని ఆత్మ విశ్వాసం నిశ్శబ్దంగా చెబుతుంది "ఇది కూడా గడిచిపోతుంది" ఆ భావమే మన మనసుకు ధైర్యం ఇస్తుంది.

ఆత్మవిశ్వాసం ఉన్నవాడు సాధారణంలో అసాధారణాన్ని చూస్తాడు. చిన్న అవకాశాన్ని గొప్పదిగా మార్చగలడు. తన స్వప్నాన్ని వాస్తవంగా తీర్చిదిద్దగలడు. విశ్వాసమే సృజనాత్మకతకు మూలం.

మనలో మార్పు కావాలంటే ముందు ఆలోచనలో మార్పు అవసరం. ఆ మార్పును తెచ్చేది విశ్వాసమే. ప్రతీ ఉదయం మనం మనసుతో చెప్పుకోవాలి "ఈ రోజు నేను గెలుస్తాను" ఆ మాట మనలోని నిద్రలేని శక్తిని మేల్కొలుపుతుంది.

జీవితం మనం రాసుకునే పుస్తకం. దాని ప్రతి పేజీపై విశ్వాసం అక్షరాలా ముద్రించాలి. పరిస్థితులు మనకు వ్యతిరేకం కావొచ్చు, కానీ మన మనసు మన పక్షాన ఉంటే పరిస్థితులు మారతాయి.

ఆత్మవిశ్వాసం మనిషిని విజయవంతుడిగా చేయడమే కాదు, సంతోషవంతుడిగా ఉంచుతుంది. భయాన్ని, అనుమానాన్ని, నిరాశను దూరం చేస్తుంది. విశ్వాసం ఉన్న మనసు శాంతితో నిండుతుంది.

ఈ ప్రపంచంలో బలవంతులు, ధనవంతులు, తెలివిగలవారు చాలామంది ఉన్నారు. కానీ ఆత్మ విశ్వాసం ఉన్న మనిషిని ఎవరూ ఓడించలేరు. ఎందుకంటే అతడు తన బలహీనతలకన్నా తన బలాన్ని ఎక్కువగా నమ్ముతాడు. మనలోని విశ్వాసం మనకు నీడలా తోడుంటుంది. ఒంటరితనంలో కూడా దారి చూపుతుంది. భయం, ఆలస్యం, నిస్పృహ.. ఇవన్నీ మనలోని వెలుగును కప్పేస్తాయి. వాటిని తొలగించడమే మొదటి విజయమని గుర్తుంచుకోవాలి. మానవుడు ఎదగడానికి అవసరమైంది ఆత్మ విశ్వాసం.

జీవితం గెలవడానికి మంత్రం ఒక్కటే ఆత్మ విశ్వాసం. దాన్ని కోల్పోకండి. అది ఉన్నంతవరకు మీరు ఎప్పుడూ ఓడిపోరు. ఆత్మ విశ్వాసం మనిషి వ్యక్తిత్వానికి వెన్నెముక. అది ఉన్నప్పుడు మన మాటల్లో ధైర్యం, చూపులో వెలుగు, పనిలో స్థిరత్వం కనపడతాయి. విశ్వాసం ఉన్న మనసు ఎవరి ముందు తలవంచదు. చిన్నపాటి పనైనా మనస్ఫూర్తిగా చేయడం విశ్వాసానికి పునాది. మన కృషి ఫలితాల కోసం కాకుండా ప్రామాణికత కోసం ఉండాలి. అప్పుడు విజయాలు సహజంగా వస్తాయి. ప్రపంచం మన బలహీనతను చూపిస్తుంది, కానీ విశ్వాసం మన బలాన్ని గుర్తు చేస్తుంది. మనం మన విలువను గుర్తించినప్పుడు ప్రపంచం కూడా మనపై విశ్వసిస్తుంది.

విఫలతలు రావడం తప్పు కాదు. కానీ వాటిని చూసి మన విశ్వాసం తడబడటం తప్పు. ప్రతి అపజయం వెనుక ఉన్న బలాన్ని గుర్తించగలగడం విశ్వాసం ఉన్న మనసుకే సాధ్యం. మన జీవితం మన చేతుల్లోనే ఉంది. బాహ్య పరిచయాలు, సౌకర్యాలు సహాయకారులే కానీ, ఆత్మ విశ్వాసం లేకపోతే అవన్నీ వ్యర్థం. మనమే మన జీవిత శిల్పులు. చిన్న పిల్లాడు నడవడం నేర్చుకుంటున్నప్పుడు పడిపోతాడు, మళ్లీ లేస్తాడు. ఎందుకంటే అతడు భయపడడు. ఆ ధైర్యం ఆత్మ విశ్వాసానికి ప్రతీక. పెద్దవాళ్లమయ్యాక మనం భయాన్ని సృష్టించుకుంటాం; దాన్ని జయించడం నేర్చుకోవాలి.

ఆత్మ విశ్వాసం ఉన్న మనసు ద్వేషం చేయదు. విజయాన్ని ఇతరుల ఓటమిగా చూడదు. అలాంటి మనసు ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది. మనిషి విశ్వాసం ఒక విత్తనం అయితే, దానిని పెంచేది కృషి, సహనం, ధైర్యం. ఈ మూడు ఉంటే ఆ విత్తనం వృక్షమవుతుంది. సమాజం



మారుతూనే ఉంటుంది, సవాళ్లు వస్తూనే ఉంటాయి. కానీ విశ్వాసం ఉన్న మనసు వాటిని అవకాశాలుగా చూస్తుంది.

మన ఆలోచనలు మన జీవితం. మనం విశ్వాసంతో ఆలోచిస్తే చీకటిలోనూ వెలుగు కనిపిస్తుంది. జీవితం మనల్ని పరీక్షిస్తుంది కానీ, వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్పేది ఆత్మ విశ్వాసమే. మనలోని ఆ బలం ఎప్పుడూ మనతోనే ఉంటుంది. మనలోని విశ్వాసం మన దారి తప్పనీయదు. మన తప్పులను సరిచేసే శక్తి అదే. భయం మనసును మూసేస్తుంది, విశ్వాసం తెరుస్తుంది. తెరిచిన మనసులోనే కొత్త దారులు పుడతాయి. మన మనసు ఒక తోట అయితే, ఆత్మ విశ్వాసం దానిలో పూసే పువ్వు. కృషి, నీరు, సహనం ఎరువు, ఆశ వెలుగు.. ఇవి ఉన్నంతవరకు ఆ పువ్వు వాడిపోదు.

కొన్నిసార్లు మన ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. కానీ మనం మనమీద నమ్మకం పెట్టుకుంటే చాలు. విత్తనం నేల కిందే పెరుగుతుంది; కనిపించదు కానీ బలం పెంచుకుంటుంది. మన విశ్వాసం కూడా అలాగే. ప్రతి రోజు మనం గమ్యానికి దగ్గరవుతూనే ఉంటాం. ఆగిపోకపోతే మనలోని విశ్వాసం ఎప్పుడూ చల్లబడదు. విశ్వాసం ఉన్న మనిషి తన విఫలతను స్నేహితుడిగా చూస్తాడు. ప్రతి ఓటమి వెనుక పాఠం దాగి ఉంటుంది. ఆ పాఠమే రేపటి విజయానికి పునాది. అడ్డంకులు రావడం సహజం. కానీ వాటిని మెట్లుగా మార్చగలగడం విశ్వాసం ఉన్న మనసుకే సాధ్యం.

విశ్వాసం ఉన్నవాడు లోపల నుంచి బలపడతాడు. అతడు క్రమశిక్షణతో, నిజాయితీతో పనిచేస్తాడు. అలాంటి మనిషి ఎప్పుడూ విజేతగానే నిలుస్తాడు. మనలోని వెలుగు ఇతరుల చీకటిని తొలగిస్తుంది. విశ్వాసం ఉన్న మనసు ఇతరులలో ఆశ పుట్టిస్తుంది. అదే మానవతా సారం. జీవితం యుద్ధమే, కానీ ఆ యుద్ధం మనలోనే. ఒకవైపు భయం, మరోవైపు విశ్వాసం. ఎవరు గెలుస్తారో మనమే నిర్ణయించాలి.

విశ్వాసం మన పునర్జన్మ. ఎన్ని సార్లు పడిపోయినా అది లేపుతుంది. మన కలలను మళ్లీ మేల్కొలుపుతుంది. ఆత్మ విశ్వాసం ఉన్న జీవితం ఒక దీపస్తంభంలా ఉంటుంది చుట్టూ చీకటైనా వెలుగునిస్తుంది. తన వెలుగుతో ఇతరులకు దారి చూపుతుంది.

మన జీవితానికి అర్థం ఇచ్చేది ఆత్మ విశ్వాసమే. అది మన గుండె చప్పుడు, మన శ్వాసలోని రాగం, మన బతుకులోని పునాది. దానిని ఎప్పటికీ కోల్పోకండి. అదే జీవన సత్యం, అదే శాశ్వత రహస్యం.

– డా॥ చిటికెన కిరణ్‌కుమార్

# సేవా సమాజ ప్రతిరూపం దర్శింపచేసే ఉన్నత దర్పణం




ఉద్యోగం అయినా వ్యాపారం అయినా సేవాధర్మంగా నిర్వర్తించటం, జీవితాన్ని సేవ ప్రయాణంగా సమాజ సంక్షేమం అభిలషిస్తూ, అడుగులు వేయటం అందరికీ సాధ్యం కాదు. 'సమాజ దర్పణం' రచయిత, సామాజిక విశ్లేషకులు పేరి నాగేశ్వరరావు నిజాయితీతో చేసిన సేవ ఎప్పటికీ వృథా కాదు అంటారు. 56 అంశాలతో రూపొందించబడిన ఈ కరదీపిక మనలో, ఆలోచనలను మేల్కొలిపి, చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించుకొనే కృషికి దోహదం చేస్తుంది. శ్రీద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇఫాన్ ఫౌండేషన్ ప్రచురించిన ఇందులో డా॥ అబ్దుల్ కలాం, డా॥ అయ్యగారి సాంబశివరావు, గాన గంధర్వ ఘంటసాల, గజల్ గాయకుడు శ్రీనివాస్, రాకేశ్ ఝున్‌ఝున్వాలా, ప్రవచనకర్తల ప్రస్తావనలు వ్యక్తిత్వ వికాసాన్ని స్ఫూర్తిదాయకంగా పొందుపరిచారు. వర్తమాన జీవన అంశాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, లివింగ్ రిలేషన్స్, కార్పొరేట్ సాంఘిక బాధ్యత, 50:30:20 ఫార్ములా సాంకేతిక జ్ఞానాన్ని సమన్వయించారు. ఉపనయనం, పెద్దల దీవెనలు, చద్దన్నం ప్రాధాన్యత కూడా వివరించారు. ప్రస్తుత సమాజ నడవడిక కారణంగా, కనుమరుగవుతున్న కాకి నుండి నేర్చుకోవలసిన పదమూడు సద్విషయాలను అద్భుతంగా తెలియచెప్పారు.

**(సమాజ దర్పణం-రచన: పేరి నాగేశ్వరరావు; వెల: రూ.150/-లు; ప్రతులకు: పేరి నాగేశ్వరరావు, 1-4-321, న్యూ మారుతీ నగర్ ఈస్ట్, కొత్తపేట, హైదరాబాద్-500 060)**

# పీడిత దళిత జీవన చిత్రణ 'కాపరి' నవల

పుస్తక సమీక్ష





'కాపరి' సమాజంలో అణగారిన, నిరుపేద వర్గాల జీవన వ్యథను, వేదనాయుత నిరంతర పోరాటాన్ని పల్లెల్లో తరతరాల జీవనయానంలో అమానవీయంగా మనుగడ సాగించే జీవన విషాద కథనాన్ని కళ్లకు కట్టిస్తుంది. మారుతున్న కాలంలో కూడా నిశ్శబ్దంగా సాగుతున్న ఈ జీవన సంఘర్షణను నవలా రచయిత మూరిశెట్టి గోవింద్ ప్రతిభావంతంగా వాస్తవ విషాదాన్ని చదివింపచేసారు.

కుల వృత్తుల, కష్టజీవుల జీవతాలలోకి తొంగిచూసే తీరిక, ఓపిక, సహన మానవీయ సౌహార్దత లేని ఈ ప్రస్తుత సాంకేతిక సంపన్న సమాజం కళ్లు తెరిపించే నవల మూరిశెట్టి సృష్టించారు. అంబేద్కర్ భావజాలం నేటి సమాజాన్ని నిలదీస్తున్నా, ప్రభుత్వాల్ని ప్రశ్నిస్తున్నా నిస్సహాయ అట్టడుగు వర్గాల పీడిత ప్రజలు ఎలా దోపిడికి గురి అవుతున్నారో ఈ నవలలోని వివిధ సందర్భాలలో, పాత్రలు సంఘటనలు వ్యక్తీకరిస్తూ నవల ఆశావహంగా ముగుస్తుంది. బతుకుతెరువు కోసం చావుడప్పులు, పీనుగుల గుంతలు, శ్మశానాల కాపలాలు వృత్తి ధర్మంగా నిర్వర్తించే 'తోటి' జీవుల హృదయ వేదనను నవలగా ఆవిష్కరింపచేసిన మూరిశెట్టి, దళిత వర్గాల అనైక్యత వక్రబుద్ధులకు మోసం చేసే అవకాశం యిచ్చే సందర్భాలను కూడా స్పష్టం చేసారు. నిద్రాణమైన మనస్సాక్షిని తట్టిలేపి తెలుగు నవలా సాహిత్యంలో ప్రకంపనం సృష్టించిన రచయిత మూరిశెట్టి అభినందనీయులు.

**(కాపరి-రచన: మూరిశెట్టి; వెల: రూ.150/-లు; ప్రతులకు: అన్ని పుస్తక విక్రేత సంస్థలు)**

# జంట కవుల స్నేహ కవితా విపంచిక



జంట కవుల స్నేహ స్వర్ణోత్సవ కవితా విపంచిక 'రెండు ఒకట్లు' అపూర్వ స్నేహ సాహితీ సాన్నిహిత్యాన్ని కవితాత్మకంగా దర్శింపచేస్తోంది. వి.పి.చందన్‌రావు, కందాళై రాఘవాచార్య ఇద్దరు ప్రతిభావంతులైన జంటకవులుగా ఈ వచన కవితా సంపుటిలో 100 కవితలున్నాయి. ఒకరికొకరు దీటైన కవులు కావటంతో ప్రతీ కవిత, వైవిధ్యభరితంగా, మేలి కవితా కల్పనా చమత్కృతితో పరిపూర్ణంగా తీర్చిదిద్ది ఆకట్టుకుంటున్నాయి. 'అమ్మకు జ్వరం వస్తే'లో పిల్లల సపర్యలు, 'నా తల నాకు బరువేం కాదులే' అనే 'బరువుతల', రైతుల ఆత్మహత్యలను గురించి 'నాగలిపై కన్నీటివాన'.. ఈ జంటకవులు వచన కవిత్వపు అభివ్యక్తికి, వినూత్న భావాల ఇతివృత్తాల కవితలు ఈ సంపుటిలో చోటు చేసుకున్నాయి. "కవిత్వమే మా స్నేహానికి పునాది.. అంటూ ఇరుగుండెలు కలిపి పచ్చగా అల్లుకున్న తెలుగక్షరాల స్నేహం మాది" 'రెండు ఒకట్లు' ఒకటిగా వర్తమాన విషయాల పట్ల కవితాత్మిక ఆత్మీయ స్పందనగా దర్శింపచేస్తుంది. శ్రీశ్రీ, త్రిపురనేని శ్రీనివాస్, సలంద్ర, సినారె, శేషేంద్ర, దాశరథి, అజంతా, కొండా రాజశేఖర గౌడ్, కాళోజీ వంటి ప్రముఖులే కాకుండా ఇందూరు స్మరణీయుల పేరిట వివిధ రంగాల కళామూర్తులకు స్మృత్యంజలి ఘటించడం ఎంతైనా అభినందనీయం.

**(రెండు ఒకట్లు-రచన: వి.పి.చందన్‌రావు, కందాళై రాఘవాచార్య, వెల: రూ.200/-లు; ప్రతులకు: వి.పి.చందన్ రావు, 10-14-1562/వి, సీతారాంనగర్ కాలనీ, గుజరాతీ ఫంక్షన్ హాల్ వెనుక, వార్నిరోడ్, నిజామాబాద్-503 001)**

– జయసూర్య

# 17 మే, 2026 నుండి 23 మే, 2026 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం ఆరోగ్య పరిస్థితి చక్కబడుతుంది. అనుకున్న పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక లావాదేవీలలో ఏర్పడిన వివాదాలు పరిష్కారమై కొంత ధనలాభం పొందుతారు. స్థిరాస్థి వృద్ధి చేసుకుంటారు. కొత్త విద్యల పట్ల ఆసక్తి చూపుతారు. బంధువులు, మిత్రుల నుండి మంచి వార్తలు వింటారు. భాగస్వామ్య వ్యాపారాలలో స్వల్ప మార్పులు సంభవం. ఒక సమస్య తీరితే మరో సమస్య కొత్త కోణంలో తారసపడుతుంది.

### వృషభం

ఈ వారంఆర్థిక స్థితిగతులను మెరుగుపరచుకోవడానికి సమాయత్తమవుతారు. కొత్త వారితో పరిచయాలు ఏర్పడతాయి. ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. భూవివాదాలు తీరి లబ్ధి పొందు తారు. ఋణాలు కొంత వరకు తీరతాయి. పనులు అనుకున్న రీతిలో పూర్తి కాగలవు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. పాత బాకీలు వసూలవుతాయి. ఇంటర్వ్యూలలో పాల్గొంటారు. వాహన సౌఖ్యం పొందుతారు.

### మిథునం

ఈ వారం ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. బంధువులు, సోదరులతో స్వల్ప విభేదాలు తప్పక పోవచ్చు. స్థిరాస్థి వృద్ధి చేసుకుంటారు. బాకీలు వసూలై కొత్త వస్తువులు కొంటారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. కొత్త మిత్రులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆరోగ్య సమస్యల నుండి బయటపడతారు. వృత్తి వ్యాపారాలలో అనుకూల మార్పులు, స్థాన చలన సూచనలు ఉండవచ్చు. తీర్థయాత్రలు చేస్తారు.

### కర్కాటకం

ఈ వారం పనులలో ఎదురైన ఆటంకాలను అధి గమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉంటుంది. నూతన పెట్టుబడులలో తొందరపాటు నిర్ణయాలు వద్దు. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. కోర్టు కేసులు నిదానంగా పరిష్కారమవుతాయి. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. నిత్యం లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి.

### సింహం

ఈ వారం ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. సాహస కార్యాలు చేస్తారు. సోదరుల, బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. కుటుంబ, ఆరోగ్య సమస్యల నుండి బయటపడతారు. అనికోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. గృహం, వాహనాలను కొనుగోలు చేస్తారు.

### కన్య

ఈ వారం ఆర్థిక వ్యవహారాలలో ఒడిదుడుకులు ఏర్పడినా అధిగమిస్తారు. ఈవారం మీరు చేసే ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప మార్పులు చోటుచేసుకుంటాయి. వివాదాలు, కోపతాపాలకు దూరంగా ఉండండి. అష్టగణపతి పీఠాన్ని నిత్యం సిద్ధగంధంతో పూజించండి. బంధువుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. నిత్యం అష్టమూలికా గుగ్గిలంతో ధూపం వేయడం చెప్పదగిన సూచన.

### తుల

ఈ వారం పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. పెట్టుబడులకు తగిన లాభం చేకూరుతుంది. నూతన విద్య, ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. షేర్లు, భూముల క్రయవిక్రయాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నూతన పరిశ్రమలు, సంస్థలు ప్రారంభిస్తారు. సోదరుల నుండి ధనవస్తు లాభాలు పొందుతారు. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

### వృశ్చికం

ఈ వారం దూరపు బంధువుల నుండి ఆహ్వానాలు అందుతాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగుపడ తాయి. సమస్యలు సృష్టించాలనుకున్న వారే మీకు సహాయ పడడం విశేషం. ఆర్థిక లావాదేవీలు లాభ సాటిగా సాగుతాయి. ఋణ బాధలు నుండి బయటపడతారు. వాహన, ఉద్యోగ యత్నాలు కలిసి వస్తాయి. ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. కోర్టు కేసులు పరిష్కార దశకు చేరతాయి. స్పెక్యులేషన్కు దూరంగా ఉండండి.

### ధనస్సు

ఈ వారం పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుసుకొని సహాయం పొందుతారు. మీలోని ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. ఆర్థికాభివృద్ధి సాధిస్తారు. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. గృహ నిర్మాణాలోచనలు కలిసి వస్తాయి. వాహన యోగం పొందుతారు. ఆకస్మిక ప్రయాణాలు చేసి తద్వారా లాభపడతారు. విద్యార్థినీ, విద్యార్థులు పోటీపరీక్షలలో విజయం సాధిస్తారు. ఇన్నాళ్లుగా మీ మనస్సులో దాగివున్న భయము, భ్రాంతి నిష్కారణమైనవేనని తేలిపోతుంది. మనస్సు తేలికపడుతుంది.

### మకరం


ఈ వారం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కోపతాపాలకు దూరంగా వుండండి. ఇంద్రాణీ రూపు ధరించటం మంచిది. బంధుమిత్రుల సలహాలు తీసుకుంటారు. మనోనిబ్బరంతో ముందడుగు వేసి ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు సాగిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి,వ్యాపారాలలో మార్పులు వుంటాయి. క్రయవిక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు.


### కుంభం


ఈ వారం ఆదాయ మార్గాలు మెరుగుపడతాయి. చేపట్టిన కార్యక్రమాలలో విజయం నామమాత్రంగా సాధిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగులకు పదోన్నతులు వుంటాయి. రాజకీయ రంగాలలోని వారికి అనుకూల కాలం. కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. ఆరావళి కుంకుమతో మహాలక్ష్మీదేవి పూజ చేయండి. కొత్త బాధ్యతలు తీసుకుంటారు. నూతన ఒప్పందాలు కలిసి వస్తాయి.

### మీనం


ఈ వారం అనేక లాభదాయక వ్యవహారములు మీకు అనుకూలముగా మారుట వలన సాటి వారికి అసూయ పెరుగు అవకాశము ఉన్నది. కొన్ని త్యాగముల కొరకు నిర్బంధములను అతిక్రమించ వలసి వస్తుంది. ప్రమోషన్లకు అవకాశం వుంది. సహోదర, సహోదరీ వర్గీయులు కొన్ని కారణముల వలన దూరంగా ఉంటారు. స్వజనుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. నిత్యం నాగసింధూరం ధరించండి.


గెలిచినోళ్లను క్యాంపుల్లో ఎందుకు
పెడుతారన్నా.. మన లెక్క ఓటు అమ్ముకుంటారనా?!


మన ఓనర్ది ఇతనిది ఒకే సామాజిక
వర్గం అట.. లోపలికి వెళ్లేముందే చెప్పాడు..!!


స్వాగతం! సోషల్ మీడియా
ఇంటర్నెట్ లేని ప్రపంచానికి!!

# ఈ వారం కార్టూన్స్


ఈ
గాజు వంతెన
చైనాలోని జెజియాంగ్
ప్రావిన్స్‌లో ఉంది. ఈ బ్రిడ్జ్ పైన
నడవడానికి మెట్లు ఉండడం
విశేషం. దీనిని 'రుయి' బ్రిడ్జ్
అని పిలుస్తారు.